విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం — జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 ● సంచిక : 126 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi బుధవారం 20 మే 2026 ● పేజీలు : 8 ● వెల 2/-


## పవన్ కళ్యాణ్ ఆరోగ్యంపై కేంద్రమంత్రి ఆరా

### నేరుగా ఫోన్ చేసి పలకరించిన ప్రహ్లాద్ జోషి

**అమరావతి,మే19 :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోగ్యం గురించి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ఫోన్ చేసి ఆరా తీశారు. ఇటీవల పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కొన్నిరోజుల క్రితం పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో ముక్కుకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. వైద్యుల సూచన మేరకు ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. 'మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. ఆరోగ్యం అన్నిటికన్నా ముఖ్యం. అంటూ పవన్ కల్యాణ్‌ను ఫోన్‌లో ప్రహ్లాద్ జోషి పరామర్శించారు. రాజకీయ బాధ్యతలతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకొని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. 'నేను ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినప్పుడు తప్పకుండా మిమ్మల్ని కలుస్తాను' అని డిప్యూటీ సీఎంకు చెప్పారు. అంతేకాకుండా పవన్ ఆరోగ్యం కోసం తాను తిరుపతి బాలాజీని ప్రార్థిస్తున్నానని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

## ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం

- ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే వారిపై ఆంక్షలు
- వీసాలను తాత్కాలికంగా నిలిపివేసిన అమెరికా

**వాషింగ్టన్,మే19 చట్టం న్యూస్ :** ఎబోలా వ్యాప్తిని నివారించడానికి ముందుజాగ్రత్త చర్యలను బలోపేతం చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనిలో భాగంగా వ్యాధి వ్యాప్తి చెందిన ఆఫ్రికా ప్రాంతాల నుండి వచ్చే విమాన ప్రయాణికులను పరీక్షించడంతో పాటు, వీసాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డి ఆర్ సి) లో ప్రాణాంతకమైన ఎబోలా వ్యాప్తిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఒ) అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన నేపథ్యంలో, యుఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) ఈ నివారణ చర్యలను చేపట్టింది. విమానాశ్రయాలలో స్క్రీనింగ్‌తో పాటు, గత 21 రోజులలోపు ఉగాండా, డి ఆర్ సి, దక్షిణ సూడాన్‌లకు ప్రయాణించిన అమెరికా యేతర పాస్‌పోర్ట్ హోల్డర్లపై ప్రవేశ ఆంక్షలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఉగాండాలోని కంపాలాలో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం అన్ని వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేసి, ప్రభావితమైన దరఖాస్తుదారులకు సమాచారం

మిగతా 2వ పేజీలో..

## మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండ



- మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్లు విడుదల
- మన తీరంలో మనదే బోటు..మనదే వేట
- పొరుగు రాష్ట్రాల మత్స్యకారులకు స్థానం లేదు
- సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ

**నెల్లూరు,మే19 చట్టం న్యూస్ :** మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం తుమ్మలపెంటలో 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. చరిత్రలో తొలిసారి రూ.262 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రూ.3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. 'బోటూ మనదే.. వేటా మనదే' అని సీఎం అన్నారు. తీరం మనదే.. బోటు మనదే.. వేటా మనదే.. రాజీలేదు. ఎవరైనా వస్తే రానిచ్చే పరిస్థితి లేదు. భయపడేది లేదు. ఎవరి కోసమో మన జీవనోపాధి కోల్పోవడమేంటి? మన తీరంపై మనకే హక్కులుంటాయన్నారు. పొరుగు రాష్ట్రాలు రావడానికి లేదు. బోటు చొరబడగానే కలెక్టర్‌కు మెసేజ్ వస్తుంది. మెసేజ్ రాగానే అప్రమత్తమవుతాం.. ఎవరినీ రానివ్వం అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మత్స్యకారులకు ఎల్లప్పుడూ ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఆర్థిక భరోసా ఇస్తున్నాం. చరిత్రలో తొలిసారిగా రూ.260 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో వేశాం. గతేడాది 1,21,433

మిగతా 2వ పేజీలో..

## వీధికుక్కలను తరలించాల్సిందే

- ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు
- ప్రతి జిల్లాలో పూర్తిస్థాయిలో బర్త్ కంట్రోల్
- స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలను లేకుండా చేయాలి
- గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సిందేనన్న సుప్రీం



**న్యూఢిల్లీ,మే19 చట్టం న్యూస్ :** వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందేనని సుప్రీం మరోమారు స్పష్టం చేసింది. ఈ విషయంలో రాజీలేదని తెలిపింది. ఇది ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశగా పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను తొలగించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను

మిగతా 2వ పేజీలో..

## యూజిసి నెట్ దరఖాస్తులకు నేడే చివరి రోజు

### దరఖాస్తు చేయని వారు ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశం

**న్యూఢిల్లీ,మే19 :** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2026 పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక హెచ్చరిక జారీ చేసింది. జూన్ 2026 సెషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియ మే 20తో ముగియనున్నట్లు వెల్లడించింది. ఇంకా దరఖాస్తు చేయని అభ్యర్థులు వెంటనే అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి అప్లై చేయాలని సూచించింది. యూజీసీ నెట్ 2026 పరీక్షలు జూన్ 22 నుంచి 30 వరకు కంప్యూటర్- బేస్డ్ టెస్ట్ మోడ్‌లో జరగనున్నాయి. మొత్తం 85 సబ్జెక్టులకు ఈ పరీక్ష జరుగుతుంది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత, అలాగే పీహెచ్‌డీ అడ్మిషన్లకు ఈ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుంది. అభ్యర్థులు దరఖాస్తు నింపి, ఫీజు చెల్లించిన తర్వాత తప్పనిసరిగా కన్ఫర్మేషన్ పేజ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని భద్రపరచుకోవాలని ఎన్‌టీఏ సూచించింది. ఫీజు చెల్లింపు తర్వాత మాత్రమే దరఖాస్తు పూర్తి అయినట్లుగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు మే 20 చివరి తేదీ. మే 22 నుంచి మే 24 వరకు సవరణలు చేసుకునే వీలుంటుంది. ఈ సమయంలో అభ్యర్థులు తమ దరఖాస్తులోని వివరాలను సవరించుకునే అవకాశం ఉంటుంది. అడ్మిట్ కార్డులు జూన్ 15న విడుదలయ్యే అవకాశం ఉందని ఎన్‌టీఏ తెలిపింది. పరీక్ష కేంద్ర సమాచారం అభ్యర్థులకు జూన్ 10 నాటికి తెలుస్తుంది. అభ్యర్థులు అధికారిక ద్వారా అప్లై చేసుకోవచ్చు.

## తీరప్రాంత భద్రతపై అప్రమత్తం

- ఎల్లవేళలా నిరంతర గస్తీతో పర్యవేక్షణ
- సీ పెట్రోలింగ్‌కు జాయింట్ టాస్క్‌ఫోర్స్
- అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం
- మత్స్యకారుడి ఇంట్లో గరిటె తిప్పిన బాబు

**నెల్లూరు,మే19చట్టం న్యూస్ :** ఏపీ సముద్ర తీర ప్రాంత భద్రతపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సముద్రంలో నిరంతర గస్తీ కోసం పలు శాఖల అధికారులు, స్థానిక మత్స్యకారులతో సీ పెట్రోలింగ్ జాయింట్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. నెల్లూరు సముద్ర తీరంలో నిరంతర గస్తీ కోసం ఏర్పాటు చేసిన జాయింట్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ పెట్రోలింగ్ కేంద్రాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. డ్రోన్ల ద్వారా గస్తీ నిర్వహిస్తూ, హెచ్చరికలు జారీ చేసే సాంకేతిక

మిగతా 2వ పేజీలో..

## టిడిపికి అండగా మత్స్యకారులు

### అబద్ధాలు చెప్పం...ప్రచారాలు చేసుకోం
### వ్యవసాయశ్శాఖ మంత్రి అచ్చన్నాయుడు



**నెల్లూరు,మే19చట్టం న్యూస్ :** టీడీపీ స్థాపించిన నాటి నుంచి పార్టీకి, ఎన్టీఆర్, చంద్రబాబుకి ఎన్నెన్నో కష్టాలు వచ్చాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం ఇక్కడ మాట్లాడుతూ.. మత్స్యకారులు కుటుంబ సభ్యుల్లా పార్టీతో ఉన్నారని తెలిపారు. టీడీపీ అబద్ధాలు చెప్పదని... ప్రచారాలు చేసుకోదన్నారు. ప్రజలకు ఏమి కావాలో అదే చేస్తుందని స్పష్టం చేశారు. 2014 - 2019 రాష్ట్రానికి, మత్స్యకారులకి స్వర్ణయుగమన్నారు. 2019 ఎన్నికల్లో ఓ దుర్మార్గుడి మాయ మాటలు నమ్మామని.. కులాల్లో చిచ్చుపెట్టారని అన్నారు. చిన్న ఏమరుపాటుతో రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లారని

మిగతా 2వ పేజీలో..

## మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

### వేట నిషేధ భృతిని అందిస్తున్న సిఎం చంద్రబాబు
### మత్స్యకారుల సేవ కార్యక్రమంలో మంత్రి కొట్టు రవీంద్ర



**మచిలీపట్నం,మే19 చట్టం న్యూస్** మత్స్యకారులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అన్ని రకాలైన కార్యక్రమాలూ చేపడుతుందని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

మిగతా 2వ పేజీలో..

## యుద్ధప్రాతిపదికన పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ

- వీలైనంత త్వరగా సేకరణ జరగాలని ఆదేశం
- ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష




**హైదరాబాద్,మే19 చట్టం న్యూస్ :** పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు

మిగతా 2వ పేజీలో..

## నేటి నుంచి కోస్తాంధ్రలో మండుటెండలు

### తీవ్రమైన వడగాలులు వీచే ప్రమాదం
### అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరిక



**అమరావతి,మే19 చట్టం న్యూస్ :** కోస్తాంధ్ర జిల్లాల్లో పెరుగుతున్న తీవ్ర ఎండలు, వడగాలుల పరిస్థితులపై ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. మే 19 నుంచి 'ఫీల్స్ లైక్' ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మే 20 నుంచి 26 వరకు ఉత్తర, మధ్య కోస్తా జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణ, స్థానిక సంస్థలకు ప్రభుత్వం అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. వచ్చే ఏడు రోజుల పాటు హీట్ వేవ్ సన్నద్ధత చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించింది. ప్రజలకు హీట్ వేవ్

మిగతా 2వ పేజీలో..

## ఆదానీపై అమెరికాలో కేసులు కొట్టివేత

### ఆధారాలు లేవని తేల్చిన న్యాయశాఖ




**న్యూయార్క్,మే19 చట్టం న్యూస్ :** అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలపై ఉన్న కేసులను అమెరికా న్యాయ శాఖ పూర్తిగా కొట్టివేసింది. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) సహా పలు ఏజెన్సీలు ఈ కేసులను కొట్టివేశాయి. ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని, లంచాలు ఇచ్చినట్లుగా కూడా రుజువులు లేవని తేల్చింది. భారతదేశంలో ఒక సోలార్ పవర్ అమ్మకాల కాంట్రాక్టును గెలుచుకోవడానికి రూ. 2,000 కోట్లకు పైగా లంచాలు ఇచ్చారని, అలాగే పలు దశల్లో అమెరికన్ పెట్టుబడిదారుల నుంచి డబ్బు వసూలు చేశారని అదానీపై అమెరికాలో కేసులు నమోదయ్యాయి. అమెరికాలో ఇటువంటి ఆరోపణలను పూర్తిగా కొట్టివేయడం ఒక అసాధారణ చర్య అని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎస్ఈసీ దాఖలు చేసిన కేసును పరిష్కరించుకోవడానికి అదానీ 6 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించినట్లు కోర్టు

మిగతా 2వ పేజీలో..

## తీరప్రాంత భద్రతపై అప్రమత్తం

మొదటి పేజి తరువాయి..
పరిజ్ఞానాన్ని అధికారులు ప్రదర్శించారు. తమిళనాడు, పాండిచ్చేరి మరబోట్ల కదలికలపై శాటిలైట్ చిత్రాల సాయం తీసుకోవాలని ఆదేశించారు. జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థలను విస్తృతంగా వినియోగంలోకి తేవాలని సూచించారు. ఏపీ వ్యాప్తంగా ఫిష్ సీడ్ ఉత్పత్తిని పెంచాలని అధికారులకు సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. ఇదిలావుంటే నెల్లూరు జిల్లా తుమ్మలపెంటలో నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం చేపల మార్కెట్‌కు వెళ్లి చేపలు కొనుగోలు చేశారు. అనంతరం మత్స్యకారుడు తానంగారి గిరిబాబు ఇంటికి వెళ్లారు. ఆయన ఇంట్లో చేపల కూర వండుతుండగా ముఖ్యమంత్రి కూడా కాసేపు గరిటె తిప్పారు. ఆ తర్వాత గిరిబాబు కుటుంబంతో కలిసి భోజనం చేశారు.

## టిడిపికి అండగా మత్స్యకారులు

మొదటి పేజి తరువాయి..
విమర్శించారు. ప్రపంచంలో ఏపీని అసహ్యించుకునేలా చేశారని మండిపడ్డారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాక.. పరిశ్రమలు వస్తున్నాయని మంత్రి తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి ఎవరు చేశారో ఆలోచించాలన్నారు. వైసీపీ పేరు, ఆ నాయకుడి పేరు చెప్పనని... అవి చెబితే దరిద్రం చుట్టుకుంటుందంటూ వ్యాఖ్యానించారు. ఆ ఐదేళ్లలో ఏ సబ్సీడీలు ఇచ్చారో చెప్పాలని ఛాలెంజ్ విసిరారు. బీమా సొమ్ము, ఆయిల్ సబ్సీడీ డబ్బులు బకాయిలు పెట్టారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల మర బోట్ల ఆగడాలని పూర్తిగా అరికట్టామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## యుద్ధప్రాతిపదికన పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ

మొదటి పేజి తరువాయి..
జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం కీలక సూచనలు చేశారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

## నేటి నుంచి కోస్తాంధ్రలో మండుటెండలు

మొదటి పేజి తరువాయి..
అలర్ట్‌లు, జాగ్రత్తలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, వాట్సాప్, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్‌ల ద్వారా హెచ్చరికలు అందించాలని ఆదేశించింది. బస్టాండ్లు, మార్కెట్లు, ఆస్పత్రుల్లో తాగునీటి సదుపాయాలు కల్పించాలని.. అవసరమైతే చలివేంద్రాలు, తాత్కాలిక నీటి కియోస్క్‌లు ఏర్పాటు చేయాలని పేర్కొంది. నీటి కొరత ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే కమ్యూనిటీ హాళ్లు, వార్డు సచివాలయాల్లో కూలింగ్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని, బస్ స్టాప్‌లు, మార్కెట్లు, జంక్షన్లలో నీడ సదుపాయాలు కల్పించాలని సూచించింది. వృద్ధులు, నిరాశ్రయులు, కార్మికుల కోసం ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొంది. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. మధ్యాహ్న వేళల్లో బయటి పనులు తగ్గించాలని, ఫీల్డ్ పనులను ఉదయం లేదా సాయంత్రం వేళల్లో నిర్వహించుకోవాలని సూచించింది. పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపింది. తాగునీటి నాణ్యత పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించింది. హీట్ వేవ్ ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్‌లు యాక్టివ్‌గా ఉంచాలని, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించింది. వార్డు స్థాయిలో నోడల్ అధికారులను నియమించాలనీ ఆదేశించింది. జంతువులు, పక్షుల కోసం నీటి పాత్రలు ఏర్పాటు చేయాలని, హీట్ వేవ్ పరిస్థితులను ప్రతిరోజూ సమీక్షించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించింది. అత్యవసర పరిస్థితులను వెంటనే జిల్లా యంత్రాంగానికి నివేదించాలని వారికి స్పష్టం చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్ కుమార్ మెమో జారీ చేశారు.

## ఆదానీపై అమెరికాలో కేసులు కొట్టివేత

మొదటి పేజి తరువాయి..
పత్రాలు చూపిస్తున్నాయి. సాగర్ అదానీ కూడా 12 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించారు. తవెల్‌పీజీ దిగుమతులకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను అదానీ గ్రూప్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ యొక్క ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసి) దాఖలు చేసిన కేసు కూడా పరిష్కరించబడింది. ఈ ఒప్పందం 275 మిలియన్ డాలర్లకు కుదిరింది. అదానీ గ్రీన్ ఎనర్జీ మరియు అమెరికాకు చెందిన అజూర్ కంపెనీ, తమ సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఎస్ఈసీఐ నుంచే విద్యుత్‌ను కొనుగోలు చేసేలా ప్రభావితం చేయడానికి గౌతమ్ అదానీ నేరుగా జోక్యం చేసుకున్నారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో అదానీ జరిపిన సమావేశంపై కూడా ఆరోపణలు ఉన్నాయి. నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానీకి, ఎస్ఈసీ పంపిన సమన్లను జారీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది.

## ప్రజా సమస్యలపై పుచ్చలపల్లి రాజీలేని పోరాటం

వర్ధంతి సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాద్రి కొత్తగూడెం,మే19 : ప్రజా సమస్యల పరిష్కారంలో ఆనాడు పుచ్చలపల్లి సుందరయ్య వీరోచిత పోరాటం చేశారని సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభ సారపాకలోని సుందరయ్యనగర్‌లో పాపినేని సరోజిని అధ్యక్షతన జరిగింది. తొలుత బూర్గంపహాడ్ మండల కార్యదర్శి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు ముఖ్య అతిధిగా హాజరైన మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం ఆ రోజుల్లో పుచ్చలపల్లి పోరాట త్యాగం చేశారని, పేద ప్రజల పక్షాన పోరాడి కూలీ రేట్లు పెంచారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సుందరయ్య పోరాట పటిమ ఎనలేనిదని, ఆయన త్యాగాలు ఎప్పటికీ వృథా కావన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలపై బారాలు మోపుతుందని, అదేవిధంగా రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకపోతే జూన్ 2న పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని, దీనికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌవులూరి నాగమణి, కమటం మరియమ్మ, మీనా, రాము, రమేష్, ఏడుకొండలు, ప్రకాష్, దమయంతి, ఎస్కో.సహీద, మడకం లత, వెంకమ్మ, శివ పాల్గొన్నారు.

## మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

**మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి**

కామారెడ్డి,మే19 : కామారెడ్డి పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం కామారెడ్డి నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా, వర్షాకాలం మినహా మిగిలిన అన్ని కాలనీల్లోనూ నీటి ఎద్దడి ఏర్పడేదని అన్నారు. ఆ రోజుల్లో ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపే వారని చెప్పారు.ఈ నీటి సమస్యను శాశ్వతంగా తీర్చడమే తమ ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. కామారెడ్డి పట్టణానికి 10 వాటర్ ట్యాంకులు ఉన్నాయని, అమృత్ 2.0 పథకంలో భాగంగా 9 వాటర్ ట్యాంకులు పూర్తయ్యాయని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హనుమంతరావు, ఏఈ వినోద్, కౌన్సిలర్లు వాజిద్, జావేద్, అంజద్, బబ్లు, నాయకులు, కాళ్ల గణేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వీధికుక్కలను తరలించాల్సిందే

మొదటి పేజి తరువాయి..
ఉపసంహరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో జారీ చేసిన ఆ ఉత్తర్వులను సవరించాలని చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. స్కూల్, కాలేజీ, రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను తొలగించాలంటూ జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా తన తీర్పులో.. పలు కీలక అంశాలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వీధి కుక్కల సమస్యను జంతు సంక్షేమ అంశంగా కాకుండా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తి స్థాయి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. జనాభాను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే జిల్లాలో ఈ కేంద్రాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకుని స్కూళ్లు, కాలేజీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతోపాటు ఇతర ప్రదేశాల్లో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా యాంటీ రేబిస్ మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రహదారులపై సంచరించే పశువుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై తిరిగే జంతువుల సమస్యల పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐను కోరింది. రేబిస్ బారిన పడిన లేదా మానవుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ప్రమాదకర కుక్కల విషయంలో చట్టబద్ధంగా అనుమతించిన చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల అమలు కోసం విధులు నిర్వహించే ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాలకు సూచించింది. విధులు నిర్వర్తించే క్రమంలో వారిపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం

మొదటి పేజి తరువాయి..
అందించింది. డి ఆర్ సి లో ఉన్న ఒక అమెరికన్ సిబ్బందికి ఎబోలా వైరస్ సోకినట్లు డబ్ల్యుహెచ్ ఒ ప్రతినిధి సతీష్ పిళ్ళై ధృవీకరించారు. ఆ వ్యక్తికి పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో, చికిత్స నిమిత్తం జర్మనీకి తరలించేందుకు యత్నిస్తున్నామని అన్నారు. అలాగే అతనితో పరిచయం ఉన్న మరో ఆరుగురిని క్వారంటైన్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు తక్షణ ప్రమాదం తక్కువగానే ఉందని అంచనా వేస్తున్నామని, అయితే మారుతున్న పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నట్లు సిడిసి తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, ప్రస్తుతానికి ఇది ఆఫ్రికాకే పరిమితమైందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఎబోలా సంక్షోభంపై ట్రంప్ ప్రభుత్వం స్పందిస్తున్న తీరుపై అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ ఒ) నుండి అధికారికంగా వైదొలగడం, గతంలో ఎబోలా నివారణలో కీలక పాత్ర పోషించిన 'యుఎస్ ఎఐడి' (యుఎస్ ఎఐడి) నిధులలో కోత విధించడం ప్రస్తుత నియంత్రణ ప్రయత్నాలపై ప్రతికూల ప్రభావం చూపిందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం తీసుకుంటున్న ప్రయాణ నిషేధాలు కేవలం నాటకమేనని, ట్రంప్ ప్రభుత్వం ఈ విషయంలో చాలా వెనుకబడి వ్యవహరిస్తోందని జార్జ్‌టౌన్ యూనివర్శిటీ నిపుణులు మాథ్యూ కావనాగ్ విమర్శించారు. గతంలో ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయం వల్ల వ్యాధిని వేగంగా అరికట్టగలిగారని, కానీ ఇప్పుడు వందలాది కేసులు నమోదై, తీవ్రంగా వ్యాపించిన తర్వాతే చర్యలు చేపట్టడం అమెరికా వ్యూహాత్మక వైఫల్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తాము స్థానిక ఆరోగ్య సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, తక్షణ ప్రతిస్పందన చర్యల కోసం 13 మిలియన్ డాలర్ల సహాయాన్ని సమీకరించినట్లు సిడిసి ప్రకటించింది.

# మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండ

మొదటి పేజి తరువాయి..
కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందించాం. ఇవాళ 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సాయం అందించాం. 2014-19లో మత్స్యసంపద ఉత్పత్తి 19.18శాతం పెరిగింది. కానీ, వైకాపా హయాంలో నాలుగు రెట్లు పడిపోయింది. వ్యవసాయం, నిర్మాణ రంగం తర్వాత.. మత్స్య సంపదపైనే ఎక్కువ మంది ఆధారపడ్డారు. దేశంలో రొయ్యల ఉత్పత్తిలో 80శాతం ఏపీ నుంచే ప్రపంచానికి ఎగుమతి అవుతున్నాయి. సముద్రపు నీటితో సీవీడ్ కల్చర్ చేస్తే డబ్బులే.. డబ్బులు. మగవాళ్లు వేటకు వెళ్తే.. మహిళలు సీవీడ్ పండించాలి. మహిళలకు ఆదాయం పెంచే మార్గాలు సూచిస్తున్నా.. పాటించండి. మత్స్యకారుల జీవితాలు మెరుగుపడాలి. వారి జీవితాల్లో వెలుగు నింపే బాధ్యత ఈ ప్రభుత్వానిదని సీఎం అన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు ఇబ్బందులు ఉండవన్నారు. జువ్వలదిన్నె హార్బర్‌ను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. 'జువ్వలదిన్నె హార్బర్ మీ సొంతం.. నకిలీ ప్రచారాలు నమ్మొద్దన్నారు. చేపలు తింటే డయాబెటిస్ రాదన్నారు. 'మీ చేపల ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తా' అని అన్నారు. 200 మెకనైజ్డ్ బోట్ల మంజూరుతో పాటు రాయితీ ఇస్తామన్నారు. ఆక్వాను ఎక్కువ చేయాలని సీఎం పేర్కొన్నారు. వైసీపీ హయాంలో మత్స్యకారుల సాయాన్ని రూపాయి కూడా పెంచలేదని సీఎం విమర్శించారు. 2019-24 మధ్య జగన్ విధ్వంసకర పాలన చేశారని మండిపడ్డారు. 18 నెలల్లో తిరుపతి నుంచి బుల్లెట్ వాహనాలు తయారీ మొదలవనుందని తెలిపారు. ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. టీడీపీ డీఎన్ఏలో బీసీలు ఉన్నారని.. మనది తిరుగులేని అనుబంధమని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. పరిశ్రమలు, అభివృద్ధిని గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌లో స్థానికులకే ఉద్యోగాలు అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

మొదటి పేజి తరువాయి..
వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల్లో ఎక్కడా లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేట నిషేధ భృతిని మత్స్యకారులకు తొలిసారిగా ప్రకటించింది సీఎం చంద్రబాబు నాయుడే అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మంగళవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మత్స్యకారుల సేవ' కార్యక్రమానికి మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. తొలుత బియ్యం, నిత్యవసర వస్తువులతో పాటు డీజిల్ సబ్సిడీ కోసం నాడు నడకుదిటి నరసింహారావు కృషి చేశారని వివరించారు. మత్స్యకారులకు వేట నిషేధ భృతి ఏకంగా రూ.20వేలకు పెంచామని కొల్లు రవీంద్ర వివరించారు. తనకు మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసునన్నారు. రూ.4,000తో ప్రారంభించిన వేట నిషేధ భృతిని రూ.20 వేల వరకు పెంచిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రూ.260 కోట్లు మత్స్యకార భరోసా పథకంతో మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయడం హర్షణీయమన్నారు. మత్స్యకారుల జీవితాలను నాశనం చేసేలా వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి జీవో నెం.217 తీసుకొస్తే.. దానిని కూటమి ప్రభుత్వం రాగానే రద్దు చేసిందని తెలిపారు. కృష్ణా జిల్లాలో 18 వేల మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతిని అందించామని ఎక్సైజ్ శాఖ మంత్రి వివరించారు. డీప్ సీ బోట్స్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.20 కోట్లు కేటాయించినా.. ఇక్కడ సదుపాయాలు లేవన్నారు. సీ వీడ్ (సముద్రపు నాచు) పండించడం ద్వారా కూడా మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మచిలీపట్నంలో రూ.75 లక్షల వ్యయంతో పీతల హేచరీ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. మత్స్యకారులు 250 బోట్లతో ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు చెప్పడం హర్షణీయం అన్నారు. మత్స్యకారులను ఇంటికి పిలిచి విందు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?

- సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో నిర్ణయం
- 23న యాదగిరిగుట్టలో నిర్వహించే యోచన
- అధికారికంగా ప్రకటించడమే తరువాయి



హైదరాబాద్,మే19 : రాజధాని వెలుపల మరోమారు తెలంగాణ కేబినేట్ సమావేశం జరగనుందని సమాచారం. గతంలో మేడారంలో కేబినేట్ నిర్వహించిన సిఎం రేవంత్ రెడ్డి తాజాగా ఇప్పుడు యాదగిరిగుట్టలో కేబినేట్ నిర్వహించేందుకు ఆదేశంచినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 జరగాల్సిన కేబినేట్ సమావేశాన్ని 23న నిర్వహించాలని, అదికూడా యాదాద్రిలో నిర్వహించనున్నట్లు సమాచారం. 21 నుంచి సరస్వతీ అంత్య పుష్కరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాలు, పాలనా నిర్ణయాల్లో ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణ అత్యంత ఆసక్తికరంగా మారింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కాకుండా, కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేసే యోచనలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో ప్రారంభం కానున్న 'సరస్వతి అంత్య పుష్కరాలు' కావడం గమనార్హం. అదే సమయంలో, ఈ కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా, హైదరాబాద్ వెలుపల మరో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. 'బాసర సరస్వతి అంత్య పుష్కరాలు' ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. గోదావరి నది తీరాన వెలసిన బాసర క్షేత్రంలో జరిగే ఈ అంత్య పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ చరిత్రాత్మక వేడుకకు రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరు కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, పుష్కరాల పనులను పర్యవేక్షించడం మంత్రులకు విధిగా మారింది. మంత్రులంతా పుష్కరాల పనుల్లో, అధికారిక పర్యటనల్లో నిమగ్నమవ్వడం, బాసరకు వెళ్లనుండటంతో.. అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని సీఎం భావిస్తున్నారు. గతంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క - సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, నిధుల విడుదలపై కీలక నిర్ణయాలు తీసుకుని రికార్డు సృష్టించారు. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని యాదగిరిగుట్ట లోనూ అమలు చేయాలని చూస్తున్నారు. దీనివల్ల స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించే అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. బాసర అంత్య పుష్కరాల కారణంగా ఈ నెల 21న జరగాల్సిన కేబినెట్ వాయిదా పడటం, దానిని ఈ నెల 23న యాదగిరిగుట్టకు మార్చాలని యోచించడం అందులో భాగమే. అయితే ఈ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ఇందిరమ్మ ఇంటి కోసం మహిళకు వేధింపులు

## కాంగ్రెస్ నేతపై పోలీసుల కేసు నమోదు

కామారెడ్డి,మే19(ఆర్ఎన్ఎ):ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని నమ్మబలికి, దానికి ప్రతిఫలంగా తన కోరిక తీర్చాలంటూ ఓ మహిళను వేధించిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు రాజంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రాజంపేట మండల కేంద్రం చెందిన ఒక మహిళకు ఇందిరమ్మ ఇండ్లు కావాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన సదరు నాయకుడిని సంప్రదించింది. అయితే ఇల్లు మంజూరు చేయాలంటే తన కోరిక తీర్చాలని, తనకు లొంగిపోవాలని అతడు ఆమెను తీవ్రంగా వేధించడం ప్రారంభించాడు. ఈ వేధింపులు తట్టుకోలేక బాధితురాలు చివరికి రాజంపేట పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి రాతపూర్వక ఫిర్యాదు మేరకు సదరు కాంగ్రెస్ నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో మహిళపై అసభ్యంగా ప్రవర్తించినందుకు, పలువురిని డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణ రావడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన బెస్ట్ చంద్రంను పార్టీ అధిష్టానం మేరకు వాటి నుండి సస్పెండ్ చేశామని రాజంపేట మండల అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

# అనాథలైన కుటుంబానికి అండగా నిలిచిన సమ్మి గౌడ్ ఫౌండేషన్

- మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం!
- అందుబాటులో లేకపోయినా అండగా నిలిచిన సమ్మన్న - వార్డు సభ్యులు ప్రవీణ్, సంపత్ గౌడ్, సునీత..
- దళిత కుటుంబాలలో ఒక్కడు మా సమ్మన్న - రిపోర్టర్స్ - రవిచంద్ర,విక్రమ్
- 75 కిలోల బియ్యం, నెలరోజుల నిత్యావసర సరుకులతో గద్దల ప్రభాకర్ కుటుంబానికి కొండంత అండ







**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/ కేసముద్రం19/మే :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఓ విషాద ఘటన... అదే సమయంలో మానవత్వానికి ప్రతీకగా నిలిచిన ఓ సేవా కార్యక్రమం ప్రస్తుతం గ్రామ ప్రజల హృదయాలను కదిలిస్తోంది. ఈ కాలంలో మనుషుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు కనుమరుగైపోతున్నాయనే భావన నెలకొంటున్న వేళ... ఓ నిరుపేద దళిత కుటుంబం కష్టాన్ని తన కుటుంబ బాధగా భావించి ఆదుకోవడానికి ముందుకొచ్చిన "సమ్మి గౌడ్ ఫౌండేషన్" మరోసారి తన సేవా తత్వాన్ని చాటుకుంది.

ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గద్దల ప్రభాకర్ రోజువారి కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే విధి వక్రించి గత వారం రోజుల కిందట వడదెబ్బతో ప్రభాకర్ అకాల మరణం చెందడంతో ఆ కుటుంబం ఒక్కసారిగా దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది. ఇంటి పెద్దను కోల్పోయిన భార్య గద్దల సునీత ప్రస్తుతం గ్రామపంచాయతీలో సఫాయి పని చేస్తూ ముగ్గురు ఆడపిల్లల తో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. గద్దల శిరీష, గద్దల అనూష లకు వివాహం జరగగా ఇంకా పెళ్లి కాని చిన్న కూతురు గద్దల హరీష భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే పేదరికంతో సతమతమవుతున్న ఆ కుటుంబానికి ప్రభాకర్ మరణం గుండెలవిసే విషాదాన్ని మిగిల్చింది.

ఇలాంటి సమయంలో చాలామంది వచ్చి పరామర్శించి వెళ్తారు ఓదార్పు మాటలు చెబుతారు కానీ ఆ తర్వాత ఆ కుటుంబం ఎలా బతుకుతుందో ఆలోచించే వారు చాలా అరుదు. "సమ్మి గౌడ్ ఫౌండేషన్" అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ మాత్రం పూర్తిగా భిన్నంగా స్పందించారు.

"చనిపోయిన రోజు జనం ఉంటారు.పది రోజుల కార్యక్రమాలు పూర్తయ్యాకే అసలు బాధ మొదలవుతుంది. ఆకలి, ఆర్థిక ఇబ్బందులు, పిల్లల భవిష్యత్తు ఆ సమయంలోనే కుటుంబాన్ని వెంటాడతాయి. అలాంటి సమయంలో ఆదుకునే చేతులే నిజమైన బంధుత్వం" అనే మానవీయ దృక్పథంతో ఆయన స్పందించిన తీరు ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేసింది.

ప్రభాకర్ చనిపోయిన మరుసటి పరామర్శించిన సమ్మిగౌడ్ తాను ప్రస్తుతం గ్రామంలో లేకపోయినా... ఆ కుటుంబం ఆకలితో అలమటించకూడదనే ఆలోచనతో వెంటనే తన ఫౌండేషన్ సభ్యులను రంగంలోకి దించారు. ప్రభాకర్ కుటుంబానికి నెలరోజుల పాటు సరిపడే విధంగా 75 కిలోల నాణ్యమైన బియ్యంతో పాటు పప్పులు, నూనె, కూరగాయలు మరియు ఇతర నిత్యావసర సరుకులను పంపించి గ్రామ పెద్దల సమక్షంలో బాధిత కుటుంబానికి అందజేశారు.

కేవలం సరుకులు పంపించడం వరకే ఆగిపోకుండ "మీ కుటుంబానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను... పిల్లల చదువులకు ఎలాంటి ఇబ్బంది రానివ్వం... ధైర్యంగా ఉండండి" అంటూ సమ్మయ్య గౌడ్ ఫోన్ ద్వారా గద్దల సునీతకు, పిల్లలకు ఇచ్చిన భరోసా ఆ కుటుంబానికి కొత్త జీవన ధైర్యాన్ని ఇచ్చింది. ఆ మాటలు విన్న గ్రామస్తులు సైతం కంటతడి పెట్టారు.

సామాజిక సేవ అంటే అవసరంలో ఉన్న వారి కన్నీరు తుడవడం, ఆకలితో ఉన్న కుటుంబానికి అన్నం పెట్టడం, అనాథలైన పిల్లలకు భవిష్యత్తుపై నమ్మకం కల్పించడం అనే విషయాన్ని సమ్మయ్య గౌడ్ మరోసారి తన సేవా కార్యక్రమాల ద్వారా నిరూపించారని గ్రామ పెద్దలు కొనియాడుతున్నారు.

ప్రస్తుతం సమాజంలో చాలామంది ప్రచారాల కోసం సేవలు చేస్తున్న తరుణంలో... ఎలాంటి ఆర్భాటం లేకుండా,గత 18 సంవత్సరాలు గా నిజమైన మానవత్వంతో పనిచేస్తున్న "సమ్మి గౌడ్ ఫౌండేషన్" సేవలు ఆదర్శప్రాయమని దళిత సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు ప్రశంసిస్తున్నారు. "సమ్మయ్య గౌడ్ లాంటి వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరం... ఇలాంటి మనుషుల వల్లే ఇంకా మానవత్వం బ్రతికే ఉంది" అంటూ గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులుమంద ప్రవీణ్,తండ సంపత్,పలుస సునీతా వెంకన్న,జర్నలిస్ట్ లు రవి చంద్ర, మంద విక్రమ్,నలుగుర్తి ఉప్పలయ్య, మంద విక్రమ్, పలుస రాకేష్, పోలేపాక ఉప్పలయ్య, మంద శ్రీనివాస్, మంద సాయిబాబు, అన్నపాక వెంకన్న, గద్దల విజేందర్, మంద ప్రవీణ్, పందుల నాగేంద్రబాబు, గద్దల హరీష్, అజిత్ కుమార్, శ్రావణ్, భరత్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు.

తమ కష్టసమయంలో దేవుడిలా స్పందించి నెలరోజుల సరుకులు పంపించిన చిలువేరు సమ్మయ్య గౌడ్‌కు, సమ్మి గౌడ్ ఫౌండేషన్ సభ్యులకు ప్రభాకర్ భార్య గద్దల సునీత కన్నీటి కళ్లతో కృతజ్ఞతలు తెలియజేశారు..

ఉప్పరపల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఈ మానవత్వపు ఘటన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. "సాయం అంటే ఇదే... సేవ అంటే ఇదే..." అంటూ గ్రామ ప్రజలు సమ్మయ్య గౌడ్ సేవా తత్వాన్ని హృదయపూర్వకంగా కొనియాడుతున్నారు.

## రాంనూర్ లో వడ్లు దళారులకు అమ్ముకుంటున్న వైనం

**ప్రభుత్వం ఫెయిల్ అయింది అన్న రైతులు**




**వెల్గటూర్, మే 19 (చట్టం):** జగిత్యాల జిల్లా వెల్లటూరు మండలం రాంనూర్ లోవరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు సరిగ్గా జరగక జోకిన వడ్ల కు లారీలు రాక రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు,దిక్కులేని పరిస్థితి లో దళారులను ఆశ్రయించుకొని,మిల్లర్లకు తక్కువ ధరకు అమ్ముకుంటున్న రైతులు పండి చడమే పాపం అయ్యిందని అభిప్రాయం వ్యక్తం చేస్తు అవేదనతో మాట్లాడుతున్న రైతన్న.


## ప్రతిభకు పట్టాభిషేకం



**కొడిమ్యాల, మే 19(చట్టం) :** ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కరీంనగర్ ప్రేరణ రీజియన్ -9, తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రతిభకు పట్టాభిషేకం అనే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ 2025-26 విద్యా సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి ప్రతిభా పురస్కారాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

- జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ
- దరఖాస్తులకు ఆహ్వానం
- అందించే కోర్సులు.. అర్హతలు




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 19,( చట్టం బ్యూరో) :** ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ (మహిళలకు) కోర్సు వ్యవధి - 90 రోజులు అర్హత: 10వ తరగతి,
టైలరింగ్ (మహిళలకు మాత్రమే) కోర్సు వ్యవధి - 60 రోజులు, అర్హత: 5 వ తరగతి

**హోం హెల్త్ ఎయిడ్ (మహిళలకు మాత్రమే)**

కోర్సు వ్యవధి - 90 రోజులు, అర్హత: 10 వ తరగతి
ఉచిత శిక్షణ.. భోజన వసతి
ఉత్తమ శిక్షణ, కంప్యూటర్ శిక్షణ తరగతలు, అధునాతన తరగతి గదులు, యోగా, వ్యక్తిత్వ వికాస తరగతులు, ఉచిత భోజన వసతి సౌకర్యం అందుబాటులో ఉంది.
అలాగే వారాంత, పక్షాంత, మాసాంతర పరీక్షలు నిర్వహిస్తారు. స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు బోధిస్తారు.
ప్రతి 3 నెలలకు ఒక బ్యాచ్ ప్రారంభమవుతుంది.
శిక్షణ పొందాలనుకునేవారు 19 ఏండ్ల నుంచి 30 ఏండ్ల లోపు వయసు వరకు ఉండాలి.

**ఇవీ కావాల్సిన ధృవీకరణ పత్రాలు**

ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు 3, విద్యార్హత ధృవీకరణ పత్రాలు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, రేషన్ కార్డు, కులధృవీకరణ పత్రం సమర్పించాలి.
అడ్రస్, కోనరావుపేట మండలం నాగారంలో ట్రైనింగ్ ఇచ్చే కేంద్రం ఉంది.
మిగతా వివరాలకు సంప్రదించాల్సిన నెంబర్లు 9848685428, 9491566790
----------------

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిత తనికి చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్





- కొనుగోలు చేసిన వరి ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి.
- మిల్లులకు ధాన్యంతో వచ్చిన లారీలను త్వరగా అన్లోడ్ చేసి పంపించాలి.

**ఎండపల్లి, మే 19 చట్టం. :** జగిత్యాల జిల్లాలో వివిధ మండలాలలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలనే ఉదేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం పెగడపెల్లి మండలం నంచర్ల, దేవి కొండ, రాం నగర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎండపల్లి మండల కేంద్రంలోని వాయుపుత్ర రైస్ మిల్ గుల్ల కోట గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు.

అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు.

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.

రైస్ మిల్లులలో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, లోడింగ్ అన్‌లోడింగ్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులను, మిల్లర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లుల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు.

అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, డిసిఎస్ఓ జితేందర్ రెడ్డి, డీఎస్ఓ మనోజ్, తహసిల్దార్ అనిల్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లారీల సంఖ్యను మరింత పెంచాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి పరిశీలన

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా, /మే -19 (చట్టం బ్యూరో) :** కొనుగోలు కేంద్రాల నుంచి దాన్యం తరలించేందుకు ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు లారీల సంఖ్యను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. లిఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.

ధాన్యం ఎంత వచ్చింది? ఇప్పటిదాకా ఎంత కొనుగోలు చేశారో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆరా తీశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం సంచుల కోసం మరిన్ని వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

**రైస్ మిల్లులో తనిఖీ**

ఇల్లంతకుంట మండలం చింతలకుంట పల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీసాయి రైస్ ఇండస్ట్రీస్ లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ధాన్యం లక్ష్యం కేటాయింపు ఎంత? ఇప్పటి వరకు ఎంత అన్ లోడ్ చేశారు? ఏ ఏ మండలాల నుంచి ధాన్యం వస్తుందో ఆరా తీశారు. హమాలీల సంఖ్యను పెంచి.. అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని



ఆదేశించారు. పరిశీలనలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, డీసీఓ రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పిలుస్తోంది

- విద్యార్థి లోకం టెక్నికల్ విద్యా వ్యవస్థను అవలంబించుకోవాలి.
- ప్రిన్సిపల్ ఈగ మల్లికార్జున్.

**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్ /కేసముద్రం/ 19 /మే :** రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించిన పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్ మరియు సర్టిఫికెట్ వేరిపికేషన్ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా విద్యార్థులకు ముఖ్యమైన సూచనలు తెలియజేస్తున్నామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కేసముద్రం ప్రిన్సిపాల్ ఈగ మల్లికార్జున్ తెలిపారు.




పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు మే 27 నుండి మే31 వరకు ఆన్లైన్ ద్వారా ఫీజు చెల్లింపు మరియు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. మే 29 నుండి జూన్ 3 వరకు సర్టిఫికేట్ వేరిపికేషన్ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. వెబ్ ఆప్షన్ల ఫ్రీజింగ్ ప్రక్రియ జూన్ 3న నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.

జూన్ 6న సీట్ల కేటాయింపు ఫలితాలు విడుదల చేయబడతాయని, అనంతరం విద్యార్థులు జూన్ 6 నుండి 9 వరకు ఆన్లైన్ ద్వారా ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్‌లి పూర్తి చేయాలని సూచించారు. అలాగే జూన్ 8 నుండి 9 వరకు కాలేజీలలో ప్రత్యక్ష రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. తరగతులు జూన్ 15 నుండి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

విద్యార్థులకు, తల్లిదండ్రులకు మరింత సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కేసముద్రం లో హెల్ప్‌లైన్ సెంటర్ / కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ మల్లికార్జున్ తెలిపారు. పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదు, సీట్ల ఎంపిక తదితర అంశాలలో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సాంకేతిక విద్య ద్వారా ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవడానికి పాలిటెక్నిక్ విద్య ఎంతో ఉపయోగకరమని, అర్హులైన విద్యార్థులందరూ తప్పనిసరిగా కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

**షెడ్యూల్ వివరాలు:**

| ప్రక్రియ | తేదీలు |
|---|---|
| ఆన్లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు | మే 27 నుండి 31 వరకు |
| సర్టిఫికెట్ వెరిఫికేషన్ | మే 29 నుండి జూన్ 1 వరకు |
| వెబ్ ఆప్షన్స్ | మే 29 నుండి జూన్ 3 వరకు |
| వెబ్ ఆప్షన్స్ ఫ్రీజింగ్ | జూన్ 3 |
| సీట్ల కేటాయింపు | జూన్ 6 |
| ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్ | జూన్ 6 నుండి 9 వరకు |
| కాలేజీల్లో రిపోర్టింగ్ | జూన్ 8 నుండి 9 వరకు |

కౌన్సెలింగ్‌కు తీసుకురావలసిన ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు 1 జిరాక్స్ ప్రతులు:

1. 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు బోనాఫైడ్ సర్టిఫికెట్లు
2. పాలిసెట్ హాల్ టికెట్
3. పాలిసెట్ ర్యాంక్ కార్డు
4. ౧౦౪జ మెమో
5. కుల ధ్రువీకరణ పత్రం (వర్తించిన పక్షంలో)
6. తాజా ఆదాయ ధ్రువీకరణ పత్రం (వర్తించిన పక్షంలో)




7. ఆధార్ కార్డు
8. ప్రైవేట్‌గా ౧౦౪జ ఉత్తీర్ణులైన విద్యార్థులకు

**చివరి విడుత షెడ్యూల్**

| ప్రక్రియ | తేదీలు |
|---|---|
| ఆన్లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు: | జూన్ 15 |
| సర్టిఫికెట్ వెరిఫికేషన్ | జూన్ 16 |
| వెబ్ ఆప్షన్స్ | జూన్ 16 నుండి జూన్ 17 వరకు |
| వెబ్ ఆప్షన్స్ ఫ్రీజింగ్ | జూన్ 17 |
| సీట్ల కేటాయింపు | జూన్ 20 |
| ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్ | జూన్ 20 నుండి 22 వరకు |
| కాలేజీల్లో రిపోర్టింగ్ | జూన్ 22 వరకు |

విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు అన్నారు.

--------------

# సెన్సస్ విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి తగ్గించాలి

- తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ డిమాండ్
- జూన్ 9 వరకు చాలినంత సమయం ఉన్నా -అధికారులకు ఎందుకు ఈ తొందరపాటు ?
- సెన్సెస్ లాంటి అత్యంత కీలకమైన ఈ ప్రక్రియలో వేగం కంటే ఖచ్చితత్వం చాలా ముఖ్యం
- భగ్గుమంటున్న మండుటెండలు... ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఉపాధ్యాయులకు సూచన



**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం 19/మే :** సెన్సెస్ విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులు, సిబ్బందిపై పై అధికారులు ప్రారంభ దశ నుంచే అనవసర ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదని, వెంటనే అధికారులు ఈ పద్ధతిని మార్చుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ( టి పి టి ఎఫ్ ) కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం టిపిటిఎఫ్ కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోగల కేసముద్రం స్టేషన్ లో అధికారుల తొందరపాటుతనానికి, సిబ్బంది పై పెంచుతున్న అనవసర ఒత్తిడికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిపిటిఫ్ అధ్యక్షులు గుండు సురేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులతో ఇంటింటి గణన ప్రక్రియలో మొదటి మూడు రోజులు గూగుల్ మ్యాప్ ఆధారంగా హద్దులను గుర్తించడం, పరిధులను అర్థం చేసుకోవడం, ప్రాంతాలను సరిపోల్చుకోవడంలోనే ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చిందని గ్రామీణ ప్రాంతాల్లో స్పష్టమైన మ్యాపింగ్ లేకపోవడం వల్ల సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదేవిధంగా ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం, సమాచారం అందించే వ్యక్తులు చాలాసార్లు అందుబాటులో లేకపోవడం వల్ల గణన ప్రక్రియ ఆలస్యమవుతోందని, ఒకే ఇంటికి పలుమార్లు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన వివరించారు.

ఇక ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో ఉదయం 10 గంటలు దాటితే బయట తిరగలేని పరిస్థితి నెలకొందని, మండుతున్న ఎండల్లో సిబ్బంది ఇంటింటికి తిరిగి విధులు నిర్వహించడం కష్టసాధ్యంగా మారిందని అన్నారు. అయినప్పటికీ సెన్సెస్ సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారని, ఈ కష్టాలను అర్థం చేసుకోలేని అధికారులు ఇలాంటి పరిస్థితుల్లో

ప్రతిరోజూ "సంఖ్య పెంచాలి", "త్వరగా పూర్తి చేయాలి", "టార్గెట్ చేరాలి" అంటూ పదేపదే ఒత్తిడి తీసుకురావడం వారి తొందరపాటుకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ఇలా ఒత్తిడి చేయడం సెన్సెస్ సిబ్బందిలో మానసిక ఆందోళన కలిగిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గణన పూర్తి చేయాల్సిన సమయం జూన్ 9 అని ప్రభుత్వమే నిర్ణయించిందని, అంటే ఇంకా సుమారు 20 రోజుల సమయం ఉందని ఆయన గుర్తు చేశారు. సునాయాసంగా, సమగ్రంగా గణన పూర్తి చేసే అవకాశాలు మెండుగా ఉన్నప్పటికీ, ప్రారంభ దశ నుంచే అధికారుల తొందరపాటు ఎందుకో అర్థం కావడం లేదని ఆయన విమర్శించారు.

సెన్సెస్ వంటి అత్యంత కీలకమైన ప్రక్రియలో వేగం కంటే ఖచ్చితత్వం ముఖ్యమని అధికారులు గుర్తించాలని, ఒత్తిడి ద్వారా కాదు, సహకారం మరియు అవగాహన ద్వారా మాత్రమే సమగ్ర గణన సాధ్యమవుతుందని అయన వివరించారు.

అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకొని సిబ్బందిపై అనవసర ఒత్తిడిని తగ్గించి, వారికి అవసరమైన సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. భగ్గుమంటున్న మండుటెండలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల శాఖ ఉపాధ్యక్షులుకొమ్ము రాజేందర్, ఉపాధ్యాయులు సురేష్, జ్యోతి శ్రీ,రేవతి, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ భవనానికి భూమి పూజ చేసిన ఎంమ్మెల్యే మేడిపల్లి సత్యం

- జగ్గారావుపల్లి లో గ్రామ పంచాయతీ కార్యా లయం కు భూమి పూజ ;
- నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే నా లక్ష్యం ; ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 18 ,(చట్టం బ్యూరో) :** చొప్పదండి నియోజకవర్గం బోయినిపల్లి మండలం జగ్గారావుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి గౌరవ చొప్పదండి శాసన సభ్యులు మరియు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం గారు ఈరోజు భూమి పూజ నిర్వహించి, పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. జగ్గారావుపల్లి గ్రామ ప్రజల చిరకాల కోరికైన నూతన పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించి, నేడు భూమి పూజ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. నాణ్యతతో కూడిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అభివృద్ధి పనుల్లో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మనబోయిన సుకీన్ యాదవ్, స్థానిక సర్పంచ్ మధు, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి , ఏఎంసీ చైర్మన్ ఎల్లేష్, సర్పంచులు కొడగాని వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, నల్ల మోహన్ , సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, మాజీ అధ్యక్షులు రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మీరాజం, నాయకులు పిట్టల రమేష్, తిరుపతి రెడ్డి, శోభన్, రామిడి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్లేపల్లి చంద్రయ్య, సురేందర్ రెడ్డి, మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి. స్కైలాబ్ బాబు పిలుపు

### బోయినపల్లిలో ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

**బోయిన్ పల్లి మండలం /మే 19,( చట్టం బ్యూరో ) :** కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పనిగట్టుకుని మత విద్వేషాలను పెంచుతోందని, పేదల ఐక్యత కోసం సుందరయ్య స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి. స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. ?కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో డప్పు చప్పుళ్లు, సుందరయ్య చిత్రపటాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో సిపిఎం అరుణ పతాకాన్ని ఎగురవేసి, సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ తర్వాత స్థానిక ఆర్ఎంపీ, పీఎంపీ భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో 'కార్మిక వర్గ ఐక్యత - సవాళ్లు, కర్తవ్యాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సిపిఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన టీ స్కైలాబ్ బాబు మాట్లాడారు. ?త్యాగానికి నిలువెత్తు నిదర్శనం, ఆదర్శాలలో ఎవరెస్టు శిఖరమైన దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో నేటి తరం ఉద్యమించాలని ఆయన కోరారు. ఆదర్శవంతమైన విలువలతో రాజకీయాలు చేయడం కమ్యూనిస్టులకే సాధ్యమని, దీనికి సుందరయ్య జీవితమే ఆదర్శమని కొనియాడారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ, ఆ పెత్తందారీ విధానాలకు



వ్యతిరేకంగా చిన్ననాటి నుంచే ఆయన పోరాటం చేశారన్నారు. తెలంగాణలో జమీందారీ, రజాకార్ల వ్యతిరేక సాయుధ పోరాటంలో సుందరయ్య కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. వ్యవసాయ కార్మికుల కూలీల పెంపు కోసం, భూ పంపిణీ కోసం సంఘాలు పెట్టి పోరాటాలు నడిపిన మచ్చలేని మహనీయుడని శ్లాఘించారు.

?కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల పొట్టగొట్టి కార్పొరేట్ల బొజ్జలు నింపడానికి ప్రయత్నిస్తోందని స్కైలాబ్ బాబు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి మత విద్వేషాలు రెచ్చగొట్టడంపై ఉన్న శ్రద్ధ, మనుషుల బాగోగులపై లేదన్నారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలపై దాడులు పెంచడం ద్వారా బిజెపి పబ్బం గడుపుకుంటోందని మండిపడ్డారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలను మరింత ఉధృతం చేయాలని, పేదలు, కష్టజీవుల ఐక్యతను సాధించడమే సుందరయ్యకు మనం అర్పించే నిజమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ?ఈ వర్ధంతి సభలో విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షులు బొల్లి ఆధామ్ రాజ్, సిపిఎం మండల నాయకులు రామంచ అశోక్, కుడుకల గిరిబాబు, కొత్తూరు నరసయ్య, అల్వాల అంజయ్య, ఎడపల్లి బాబు, బొజ్జ శ్రీను, అనుముల రవి, ఆవుల మల్లయ్య, కోరెన్ మహేష్, రాజనర్సు, పాటల గోపి తదితరులు పాల్గొన్నారు.

## పచ్చి రొట్ట విత్తనాల కార్యక్రమంలో జీలుగా విత్తనాల పంపిణీ వ్యవసాయ శాఖ



**వెల్గటూర్,మే 19 (చట్టం):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం మన వెల్గటూర్ రైతు వేదికలో పచ్చ రొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జీలుగా విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏ,ఎం,సి, చైర్మన్ గోళ్ళ తిరుపతి, పి,ఎసి,ఎస్ మాజీ చైర్మన్ గోలి రత్నాకర్, ప్రారంభించడం జరిగింది. విత్తనాల మొలక శాతం నిర్ధారణ కోసం నమూనాలను సేకరించి విశ్లేషణకు పంపించడం జరిగింది. పరీక్షా ఫలితాలు 4-5 రోజులలో వచ్చే అవకాశం ఉంది. ఫలితాలు వచ్చిన అనంతరం పూర్తి స్థాయిలో రైతులకు విత్తనాల పంపిణీ చేపట్టబడును. పచ్చిరొట్ట విత్తనాలు వల్ల భూమిలో సేంద్రియ పదార్థాల శాతం పెరుగుతుంది. నేల సారవంతత మెరుగుపడుతుంది. నేలలో నత్రజని పరిమాణం పెరిగి పంటలకు పోషకాలు అందుతాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పెండ్యాల సాయికిరణ్ ఎంఎ, ఓ, కోటిలింగాల ఆలయ కమిటీ చైర్మన్ రమేష్, వెల్గటూర్ సర్పంచ్ కవిత, కుమ్మరిపల్లి సర్పంచ్ ఆమని, వెల్గటూర్ మండల ఉపసర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు ప్రతాప్ రావు, వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శైలందర్ రెడ్డి,వ్యవసాయ విస్తరణ అధికారులు స్రవంతి, వంశీ, పి,ఎసి,ఎస్,సీ,ఈ,ఓ,పూర్ణ, చంద్,మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ ప్రవీణ్, లింగయ్య,వెల్గటూర్ మాజీ సర్పంచ్ మురళి,రైతులు మరియు సొసైటీ సిబ్బంది. పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి ;

### ఏ ఐ ఎస్ బి రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/మే 19,( చట్టం బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్బి రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం వల్ల విద్యాశాఖ పూర్తిస్థాయిలో గాడి తప్పిందని విచ్చలవిడిగా ప్రవేట్ విద్యాసంస్థలను అకాడమీలను కళాశాలలను నిబంధనలకు విరుద్ధంగా నెలకొల్పుతూ విద్యార్థుల జీవితాలతో కళాశాలలు పాఠశాలలు అకాడమీలు చెలగాటమాడుతున్నాయని తక్షణమే నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రవేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా పర్మిషన్లు నిబంధనలకు విరుద్ధంగా ఇస్తున్న విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా సంవత్సరం వచ్చే నెల నుండి ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రైవేట్ విద్యాసంస్థలను ముందస్తుగా తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా నడిచే పాఠశాలలను కళాశాలలను అకాడమీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెట్టు రాకేష్ ,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాచర్ల రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎం.పీ



**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం /19 మే :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మాచర్ల రమేష్ తల్లి ఇటీవల స్వర్గస్థులవగా చిత్ర పటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యాన్నిచ్చి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకన్న.కైలాసం . బొల్లంమహేష్ పుల్లారెడ్డి మనుగొండ రమేష్ ముదిగిరి విజేందర్ కంకలచయ్య.కంచ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు ప్రాజెక్టులపై బిఆర్ఎస్ మోసం

### 90శాతం పూర్తి చేశామని అబద్దాల ప్రచారం


### గత ప్రభుత్వ నిర్లక్ష్యం అంతాఇంతా కాదు

### మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్,మే19 : బీఆర్ఎస్ నేతలకు పాలమూరు ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 2015లో అప్పటి సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని... రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారని గుర్తు చేశారు. లక్ష కోట్ల ప్రాజెక్టును పదేళ్లలో రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెడితే 90 శాతం ఎలా పూర్తి అయినట్లు అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు తర్వాత మొదలుపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష కోట్లు ఖర్చు చేసి ఎలా పూర్తి చేశారని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టులపై గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. గట్టు, కల్వకుర్తి, జూరాల, కోయిల్ సాగర్, భీమా అన్ని ప్రాజెక్టుల విషయంలో పక్షపాతం చూపారని మంత్రి మండిపడ్డారు. కల్వకుర్తి పంపులు బాగు చేయలేకపోయారన్నారు. పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులు సాధించలేకపోయారని తెలిపారు. కృష్ణా నీటిని పదేళ్లు ఏపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు.

## చట్టం సాహితీ లోకం 95814 19999

### ఆత్మహత్యలకు అంతమెప్పుడు?



చదువుకుంటే జీవితంలో సుఖపడవచ్చని
స్త్రీ తన కాళ్ళమీద నిలబడాలంటే
చదువు ఎంతో అవసరమని
ఆనాడే సావిత్రి భాయ్ పూలే, దుర్గాబాయ్ దేశముఖ్
జాతిపిత మహాత్మా గాంధీ చెప్పినది
స్వాతంత్ర్య వజ్రోత్సవ సమయంలో కూడా
పూర్తిగా నెరవేరిందా?

వరుసగా బాసర ట్రిపుల్ ఐటి లో విద్యార్థినుల
ఆత్మహత్యలు చూస్తుంటే
ప్రణాళిక బద్ధమైన చదువు
భారమై మానసిక ఒత్తిడికి
కారణమా?

ఏమిటీ పరిస్థితి వరుసగా వారం రోజులలోనే విద్యార్థినులు
కన్నవారి కడుపుకోతకు కారణమై
బలవన్మరణానికి పాలు పడటం
విద్యావిధాన లోపమా ,పరిస్థితుల ప్రభావమా ?

ఒక్కసారి విజ్ఞులు, ప్రాజ్ఞులు ఆలోచించండి
ఆత్మహత్య ఏ సమస్యకి పరిష్కారం కాదని
యువత తెలుసుకోండి
మీరే రేపటి ఆదర్శపౌరులని
సమాజాభివృద్ధికి సోపానాలని తెలుసుకుని
బంగరు భవిష్యత్ కి పునాదులు వేసి
పరమాత్ముడిచ్చిన వరం మానవ జీవితం
అని మరువకండి.....!!

( బాసర ట్రిపుల్ ఐటి లో వరస విద్యార్థినుల ఆత్మహత్య విని ఆర్ద్రతతో వ్రాసినది).

ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్.
(పుష్యమి)
విశాఖపట్నం.
9963265762.

## చట్టం సాహితీ లోకం 95814 19999

### పాటల బాట -- మూటల మూట



పాటే మనసుకు మధురమైన తోట,
మాటే మానవుని మాణిక్యపు కోట।
భవితకు వెలుగులు చూపించే బాట,
జీవితానికి ఆనందమందించే ఆట॥
॥ పాటే ॥

తేటతెలుగు తేనెలా జారే పాట,
పూటపూట నవ్వులు పూయించే మాట।
మమతల్ని మోసే అక్షరాల మూట,
విజయాలకు దారిచూపే పదాల వేట॥
॥ పాటే ॥


పేటలో పులకరించే ప్రేమల జంట,
ఇంటిలో పరిమళించే అమ్మ చేతి వంట।
పండించాలి మనసులో మంచిగుణాల పంట,
మండించాలి ధైర్యదీపాల వెలుగు మంట॥
॥ పాటే ॥

ఊటలా ఊరటనిచ్చే స్నేహబాట,
ఎటు చూసినా కనబడాలి ప్రేమ తోట।
పుటపుటలో పరిమళించే జ్ఞానపాట,
గంట గంటకూ మారాలి జీవనబాట॥
॥ పాటే ॥

తాటిచెట్టు నీడలా బంధాల చోట,
అటు ఇటు పరుగులు తీసే కాలబాట।
ఇటు ఆనందం, అటు ఆశల వేట,
పాటతో పరవశించే ఈ జగతి పేట॥
॥ పాటే ॥

పాట ఉంటే పరిమళిస్తుంది ప్రాణం పూటపూట,
మాట ఉంటే మధురమవుతుంది జీవనబాట।
బాట మంచిదైతే నడుద్దాం లోకం దాట,
ప్రతిపూట మనసారా ఆలపిద్దాం ప్రేమపాట॥
॥ పాటే ॥

--- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం



## చట్టం సాహితీ లోకం 95814 19999

### సాఫ్ట్.. వేర్ సంసారాలు



అలుమగలిద్దరూ..సాఫ్ట్-వేర్లు
కంపెనీలు..దారులు..వేరు వేర్లు.
ఉరకల పరుగుల జీవనం..
ఊపిరి సలపని గమనం..!

క్యాబ్..బైక్లలో..'హర్రీ బరీ' ప్రయాణాలు
'సిటీ 'లో ఆయాస ప్రయాస బతుకులు.

నిత్యం.. కంప్యూటర్లతో..కుస్తీ
వర్క్ లోడ్..జాస్తి.
ఇంటికి చేరితే..సుస్తీ..
సంసార సుఖం.. నాస్తి..!

ముద్దూ ముచ్చట్లకు..నో టైమ్
అర్జంట్..క్లయింట్లకు..వర్క్ ఫ్రమ్ హోమ్..
ఆన్ లైన్లలోనే..చాట్స్..స్వీట్స్..ట్రీట్స్
హాయ్..బాయ్..అన్నీ..సిస్టమ్స్ లోనే..!

అతనికేమో నైట్-షిఫ్ట్..
ఆమెకేమో..డే..డ్యూటీ..
వీకెండు లోనే..డేటింగ్లు..చాటింగ్లు..
హోటల్స్ లో..ఈటింగ్లు..!

తీరిక లేని కొలువులు..
తీరని..కోర్కెలు.
నలతలతో..'నలుసుల '
జన్మ కేదీ..దారి..?

కంప్యూటర్లే...పిల్లల్ని కని
పెంచి..పెద్ద చేసి..
ఈ..".సాఫ్ట్- వేర్ల "చేతిలో పెడితే..
వీరి..సంసారం.. సుఖ మయం
సులభతరం..సంతోష భరితం..కాదా..!!

విజయకుమార్ గడియా
బెంగుళూరు.

----------

## చట్టం సాహితీ లోకం 95814 19999

### అహము, అలుకల మధ్య ఆరాటము



నా మనసు లోని భావనలను నీకు చెప్పలేను.
నీతోటి జీవనపు అనుభవాలను ఎవరితో పంచుకోలేను.
నాలో పెరుగుతున్నది ప్రణయ భావనల మౌనము.
నీలో రగులుతున్నదిగా హృదయ వేదనల నిశ్శబ్దము.
నా లోని ప్రేమను నీకు తెలుప ప్రయత్నించాను.
నీ దరికి చేరటానికి నేను ఎంతో శ్రమించాను.
ఎందుకో నీ అలుక కూడా నాకు బాగా నచ్చింది.
మరెందుకో నాకు అహము చాలా అడ్డు వచ్చింది.
శ్రీ కృష్ణ పరమాత్మలా నేను నిన్ను బతమిలాడాను.
సత్యభామలా నీవు కష్టపడి అలకను సాగించావు.
అందమైన నా మనసు నందున కలిగెనుగా ఆరాటం.
అలకకు, అహానికి మధ్య జరిగెను ఘోరమైన పోరాటం.
స్పష్టత లేని నిశ్శబ్దము గాదే నీ అలక.
అస్పష్టమైన అహము గాదే నాలోని మౌనము.
అందుకే నీ నిశ్శబ్దానికి, నా మౌనానికి మధ్య యుద్ధం.
అది లేని ఆనంద లోకాలకు వెళ్ళటానికి సిద్ధం!!

డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి, చెన్నై

## చట్టం సాహితీ లోకం 95814 19999




### ఎటు చూసినా కల్తీ... ఎటు వెళ్లినా కల్తీ!

ఎటు చూసినా కల్తీ... ఎటు వెళ్లినా కల్తీ!
ప్రాణం తీసే విషతుల్యమైన కల్తీ!
ఉదయం తాగే పాలల్లో తెల్లని కల్తీ,
ఆరోగ్యం ఇచ్చే ఆకుకూరల్లో రంగుల కల్తీ.

కంటికి కనిపించే ప్రతి వస్తువులోనూ కల్తీ,
వంట గదిలో వాడే నూనె, కారాల్లోనూ కల్తీ.
పండ్లను పండించే మందుల్లోనూ కల్తీ,
మనుషుల ప్రాణాలు కాపాడే ఔషధాల్లోనూ కల్తీ.

లాభాల కోసం కక్కుర్తి పడే నైజం,
సమాజానికి చేస్తోంది తీరని ద్రోహం.
నిలువెల్లా నిండిపోయింది కల్తీ రోగం,
కనుమరుగైపోతోంది మానవత్వం, సహజత్వం.

ఆహారమే నేడు అమృతం కాక విషమైపోతోంది,
మనిషి ఆయుష్షును నిలువునా హరిస్తోంది.
స్వచ్ఛత అన్న పదానికి అర్థమే మారిపోతోంది,
కల్తీ భూతం లోకాన్ని మింగేయాలని చూస్తోంది.

చివరకు సమాజాన్ని ఏలే రాజకీయాల్లోనూ కల్తీ,
పదవుల కోసం మారే పార్టీల రంగుల కల్తీ.
ఓట్ల కోసం కురిపించే నోట్ల కల్తీ,
నాయకులు చెప్పే అబద్ధాల మాటల కల్తీ.

కల్తీని అరికట్టడం మన అందరి బాధ్యత,
అప్పుడే దొరుకుతాయి కల్తీ లేని...
రక్షణ, భద్రతలు రేపటి తరానికి.

తెలికిచెర్ల రాజ కృష్ణ కామేశ్వర రావు
రిటైర్డ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్,
భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ,
ఇస్రో, షార్, శ్రీహరికోట
సూళ్లూరుపేట / తిరుపతి జిల్లా



## చట్టం సాహితీ లోకం 95814 19999

### ఉమ్మడి కుటుంబం : అదో కల్పవృక్షము.



బతుకు బండికిబరోసా
ఉమ్మడి కుటుంబం
ఇలలో వెలసిన అద్భుతం
మనుజులు మనసుతో
మెదిలే ఉమ్మడి ఖిల్లా

ఆనందాల హరివిల్లు.
కొత్త కొత్త ఆవిష్కరణ లు
కొన్నిచెణుకులు
ఎన్నో మెళుకువలు
చిన్న పిల్లలు అల్లరి జగడాలు

పెద్దలు సరదాగా సర్ది చెప్పడం
ఇంటిల్లపాది రాత్రి భోజనాలు
అది ప్రతిరోజు వనభోజనాలు
ఆరుబయటవెన్నెల లో దాగుడు మూతలు
బామ్మా, తాతయ్యల అనుభవాలు

తాతయ్య, నానమ్మలు చెప్పే పిట్ట కథలు
కథలు కథలుగా పిల్లలకు పాఠాలు
పిల్లలకు మానసిక వికాస కేంద్రాలు
సంక్రాంతి సంబరాలు, ఎడ్ల పందాలు
గాలి పటాలుఎగురవేతబొంగరాలవేట.

పండుగ పూజలు రోజున మొక్కడాలు
సంస్కృతి సంప్రదాయవారధులు
పిల్లలకు వారసత్వ నియమాలు
ఇలా ఎన్నని, ఎంతని చెప్పను
ఉమ్మడి కుటుంబం ఒక కల్పవృక్షం.

డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం.
కవి. రచయిత. వి. కోట. చిత్తూరు జిల్లా.
9000169823.

## చట్టం సాహితీ లోకం 95814 19999

### ప్రకృతి వైపరీత్యాలు



వరదలు, కరువులు అనేవి
మానవుల పాలిట శాపాలు
పంచభూతాలు జీవరాశి
మనుగడకు ఆధార భూతాలు
ఆ పంచభూతాలే ఆగ్రహించి
ప్రళయం సంభవిస్తుంది
జీవరాశి మనుగడకు ముప్పు
భూకంపాలు
అగ్ని పర్వతాల ప్రేలుడులు
కార్చిచ్చులు భీభత్సాలు
ప్రకృతి వైపరీత్యాలే
మనిషి జ్ఞానవంతుడు
సృష్టికి ప్రతిసృష్టి చేయగల
శాస్త్రవేత్తలు ఉద్భవిస్తున్నారు
కానీ ప్రకృతిని మాత్రం శాసించలేరు
ప్రకృతి ఆగ్రహించినప్పుడు
నిస్సహాయులై అలా చూస్తున్నారు
ప్రకృతి భీభత్సాలను నివారించలేం!
వరదలను ఆపలేం!
నదులకు ఆనకట్టలు కట్టి
వరదల
తాకిడిని
తగ్గించగలం
అతివృష్టి వల్ల ఎంత నష్టమో
అనావృష్టి వల్ల అంతే నష్టం
ప్రకృతి భీభత్సాలకు గురైన
బాధితులను మానవతా దృక్పథంతో
సాటి మనిషిగా ఆదుకోవడం
మనిషిగా కనీస మానవధర్మం.

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

## చట్టం సాహితీ లోకం 95814 19999

### తేనెటీగను బ్రతికించుకో..!




తేనె సేకరణ కార్మికులు
పరాగసంపర్క కర్షకులు
ప్రపంచానికి మిత్రులు
మన తేనెటీగలు.
కాలుష్య ప్రభావంలో
పురుగు మందుల అలజడిలో
రసాయనాల ప్రభావంలో
అంతం అవుతున్నాయి
బలి అవుతున్నాయి.
కాపాడుకో
రక్షించుకో.!
పంట ఉత్పత్తులు పెరగాలన్నా
బలమైన పంటలు రావాలన్నా
తేనెటీగలు కావాలి
అవి బ్రతికి ఉండాలి.
ప్రకృతిలో ప్రతి జీవి ముఖ్యమే
కీడు చేసావో హాని చేస్తాయి
మంచి కోరావో బ్రతుకునిస్తాయి.
తెలుసుకో
బాధ్యతగా మసులుకో.

డా.యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి
ఇల్లందు ,భద్రాద్రి కొత్తగూడెం.



## చట్టం సాహితీ లోకం 95814 19999

### ధర్మజ్యోతి




ఎవరు ప్రేమించిన ప్రేమించకపోయిన
నేను ప్రేమసుధలను పంచక మానను
ఎవరు దూషించిన దూరమై నిలిచిన
నేను దయామృతాన్ని పంచక మానను

ఎవరు నాపై నవ్వుకున్న నవ్వకపోయిన
నేను నవచైతన్యమై వెలుగుతుంటాను
ఎవరు మంచిని నమ్మిన నమ్మకపోయిన
నేను నిజధర్మమును విడువక నడుస్తాను

ఎవరు గాయపరిచిన గర్వముతోనున్నా
నేను పవిత్ర గంగలా క్షమతోనే పారుతాను
ఎవరు కక్షాగ్నితో సుఖాలను కాల్చదలచినా
నేను కరుణాకుసుమమై నిత్యం విరుస్తాను

ఎవరు మోసగించిన మౌనమై పోయిన
నేను మానవతా గీతమే ఆలపిస్తుంటాను
ఎవరు రాళ్లు వేసిన దార్లో ముళ్ళు పరిచిన
నేను పరిమళించే పుష్పాలనే పరుస్తాను

ఎవరు జీవితమంతా చీకట్లను చల్లినా
నేను చిరుదీపమై వెలుగులు పంచుతాను
ఎవరు అసూయల అలజడులను రేపినా
నేను ఆశయ సాగరమై నీతిగా నిలుస్తాను

ఎవరు అపహాస్యములతో అవమానించిన
నేను ఆత్మగౌరవమును ఎప్పుడూ కోల్పోను
ఎవరు అడుగడుగునా నీతిని అడ్డుకున్నా
నేను ఆదర్శ సన్మార్గములను విడిచిపోను.

ఎవరు సన్మార్గాన్ని మరచిపోయి సాగినా
నేను మంచితనమే మంత్రంగా జపిస్తాను
ఎవరు మానవత్వ పరిమలం మసకబార్చిన
నేను మమతా చంద్రుడనై ప్రకాశిస్తుంటాను

ఎవరు ప్రపంచాన్ని ద్వేషముతో నింపినా
నేను ప్రేమవర్షమై నిరంతరం కురుస్తాను
ఎవరు హృదయాలను హింసతో నింపినా
నేను శాంతిస్వరమై మార్మోగుతుంటాను

ఎవరు నా సేవలను గుర్తించకపోయినా
నేను సేవాధర్మమే నిరంతరం సాగిస్తాను
ఎవరు నాకు తోడురాక ఒంటరిని చేసినా
నేను ధైర్యదీపమై ధరణిపై వెలిగిపోతాను

ఎవరు ఏమనుకున్నా ఏమనుకోకపోయినా
నేను ఈ సత్యపథమును ఎన్నటికీ వీడను
ఈ జగమే నన్ను మరచి నాకు దూరమైనా
నేను నా ధర్మజ్యోతిని ఏనాటికి ఆరనీయను

రచన బిటవరం శ్రీమన్నారాయణ
ఎలుకుర్తి హవేలీ
వరంగల్.

# నేడు ఎన్టీఆర్ బర్త్‌డే

## అర్ధరాత్రికి డ్రాగన్ గ్లింప్స్ విడుదల



యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవైటెడ్ పాన్–ఇండియా చిత్రం నుంచి ఎట్టకేలకు ఒక భారీ అప్‌డేట్ వచ్చేసింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు మే 20 పురస్కరించుకుని, మేకర్స్ అభిమానుల కోసం ఒక అద్భుతమైన సర్ప్రైజ్ ప్లాన్ చేశారు. ఈ రోజు అర్ధరాత్రి సరిగ్గా 11:52 గంటలకి ఈ చిత్రం యొక్క ఫస్ట్ గ్లింప్స్ డిజిటల్ ఎ÷–లాట్‌ఫార్మ్స్‌తో పాటు, ఎంపిక చేసిన థియేటర్లలో భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో గట్టి టాక్ వినిపిస్తోంది. సెన్సార్ బోర్డ్ వెబ్‌సైట్‌లో కూడా 'గ్లింప్స్ ఆఫ్ డ్రాగన్' పేరుతో సర్టిఫికేట్ పొందినట్లు సమాచారం రావడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ రాత్రి గ్లింప్స్ ద్వారా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. సాధారణంగా వచ్చే టీజర్లు లేదా గ్లింప్స్‌లు ఒకటి లేదా రెండు నిమిషాలు మాత్రమే ఉంటాయి. కానీ, ప్రశాంత్ నీల్ ఈసారి భిన్నంగా ఏకంగా 4 నిమిషాల 35 సెకన్ల రన్ టైమ్‌తో ఈ గ్లింప్స్‌ను కట్ చేసినట్లు తెలుస్తోంది. సినిమా యొక్క కథా నేపథ్యాన్ని, ఆ ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసమే ఇంత సుదీర్ఘమైన విజువల్స్‌ను ప్లాన్ చేశారట. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ హై బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలకు ఊపిరి పోసిన రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ క్రేజీ పాన్–ఇండియా విజువల్ వండర్ జూన్ 11, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

# హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష సమావేశము

**కర్నూల్, చట్టం న్యూస్ ((19 మే 2026):** సెక్రటరీసీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు బి. లీలా వెంకట శేషాద్రి న్యాయ సేవా సదన్ నందు "హిట్ అండ్ రన్ కేసులపై మంగళవారం డిస్టిక్ లెవెల్ అధికారులతో మానిటరింగ్ మీటింగ్" నిర్వహించడం జరిగినది. కర్నూలు, మరియు నంద్యాల జిల్లాల్లోని హిట్ అండ్ రన్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు నష్టపరిహారం త్వరగా అందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. హిట్ అండ్ రన్ కేసుల వేగవంతమైన ప్రక్రియకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీలతో సమన్వయం చేసుకొని హిట్ అండ్ రన్ కేసుల క్లైముల వేగవంతమైన ప్రక్రియ కోసం మరియు జనరల్ ఇన్సూరెన్సుకు క్లైములను సమర్పించడం కోసం రెవిన్యూ, పోలీస్ మరియు బీమా కంపెనీలతో సమన్వయం చేసుకోవాలని అలాగే హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు లేదా వారిపై ఆధారపడిన వారికి అర్హత ప్రకారం పరిహారం చెల్లింపు



జరిగేలా చూడాలన్నారు. అనంతరం సుప్రీంకోర్టు సుమోటో రిట్ పిటిషన్ నెంబర్. 9/2025 మరియు డబ్ల్యూ పి కేస్ నెంబర్. 1100/2025 ఆర్డర్ లోని ఆదేశాలను అమలు పరచడానికి చేయవలసిన పనులను గురించి అధికారులకు వివరించారు. ప్రతి జిల్లా కలెక్టర్ జిల్లా రహదారి భద్రత టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయాలని కోరారు. జాతీయ రహదారి గస్తీ కోసం పోలీసు మరియు రవాణా శాఖ సిబ్బందితో కూడిన ప్రత్యేక రహదారి నిఘ బృందాలను 30 రోజులలోపు ఏర్పాటు చేయాలని తెలిపారు.అత్యవసర వైద్యం అందించడానికి ప్రతి జాతీయ రహదారి మార్గంలో టోల్ ప్లాజా ల వద్ద అంబులెన్స్‌లను మరియు రికవరీ క్రేన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు.జాతీయ రహదారిపై విశ్రాంతి ప్రదేశాలు, అత్యవసర సేవలు,సురక్షిత పార్కింగ్, ప్రథమ చికిత్స సౌకర్యాలు, టాయిలెట్లు వంటి వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. జాతీయ రహదారులలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటి వద్ద హెచ్చరిక సంకేతాలు ఏర్పాటు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు ఆర్డర్ లోని అంశాలను అమలు పరిచే దిశగా ప్రతి డిపార్ట్మెంట్ పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో డిస్టిక్ రెవెన్యూ ఆఫీసర్స్, డిస్టిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్స్, డిటిఆర్ బి అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ రోడ్స్ అండ్ బిల్డింగ్, మున్సిపల్ కమిషనర్స్,జిల్లా పంచాయతీ ఆఫీసర్స్, డి ఎం అండ్ హెచ్ ఓ అధికారులు,నేషనల్ హైవే అథారిటీస్ అధికారులు, డిసిఆర్బి పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంబంధిత శాఖ అధికారులు పాల్గొనడం జరిగింది.




# కమల్ హాసన్ పొదుపు మంత్రం

### ఎకానమీ సీట్లో హైదరాబాద్‌కు రాక



విశ్వనాయకుడు కమల్‌హాసన్ తీసుకున్న ఓ నిర్ణయంతో ఆయన ఎంత గొప్ప నటుడో, ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో చెబుతూ వైజయంతీ మూవీస్ సంస్థ ఓ ట్వీట్ చేసింది. ఇటీవల కాలంలో సినిమా షూటింగ్ బడ్జెట్ కన్నా నటీనటులకు కల్పించే సౌకర్యాలు ఖర్చే ఎక్కువ అవుతోంది. మేకర్స్ అనవసరపు ఆర్భాటాల తగ్గించుకోవాలంటూ కమల్ హాసన్ ఇటీవల ఓ ప్రకటన జారీ చేశారు. అంతేకాదు దానిని ఆచరణ రూపంలోనూ చూపించారు. ఈ నేపథ్యంలో ఆయన 'కల్కి' సీక్వెల్ షూటింగ్‌కు ఎకానమీ ఫ్లైట్‌లో హైదరాబాద్‌కు వచ్చారు. దీనిని ఉదహరిస్తూ వైజయంతి మూవీస్ సంస్థ ఆయనను అభినందించింది.

'ప్రస్తుతం సినిమా పరిశ్రమ నిర్మాణపరంగా ఎంతో కష్టాలను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో కమల్‌హాసన్ ప్రైవేట్ చార్టర్ విమానాలు, విలాసవంతమైన ప్రయాణాలను పక్కనపెట్టి, ఎకానమీ ఫ్లైట్‌లో నేరుగా షూటింగ్ సెట్‌కు వస్తున్నారు. ఆ నిర్ణయం ఆయన ఎంతటి దిగ్గజమో తెలియజేస్తోంది. చిత్ర పరిశ్రమలో అద్భుతాలు జరగడానికి ఇది మొదటి అడుగు అనుకోవచ్చు' అని ట్వీట్‌లో వైజయంతి మూవీస్ సంస్థ పేర్కొంది. ప్రభాస్ హీరోగా నాగ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి కొనసాగింపుగా కల్కి పార్ట్ 2 రూపొందుతున్న సంగతి తెలిసిందే! ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో కమల్ సుప్రీం యాస్కిన్‌గా నటిస్తున్నారు. ఈ మధ్యన కమల్, అమితాబ్‌పై కీలక సన్నివేశాలను తెరకెక్కించారు. తాజా షెడ్యూల్ కోసం కమల్ హైదరాబాద్ వచ్చారు.

దీనికి సంబంధించిన ఓ ఫొటోను వైజయంతీ సంస్థ ట్వీట్ చేసింది.

# 23న భోపాల్‌లో పెద్ది సందడి




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ నగరాల్లో దీని స్పెషల్ ఈవెంట్‌ను నిర్వహించాలని టీమ్ భావిస్తోంది. తాజాగా ముంబయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగిన విషయం తెలిసిందే. దీని తర్వాత మే 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఏఆర్ రెహమాన్‌తో లైవ్ కాన్సర్ట్‌ను నిర్వహించనున్నారు. భారీ స్థాయిలో జరగనున్న ఈ ఈవెంట్ కోసం టీమ్ పనులు ప్రారంభించింది. తాజాగా భోపాల్‌లోని బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్స్‌లో పూజా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇప్పటికే 'పెద్ది'నుంచి వచ్చిన రెండు పాటలు సూపర్ హిట్‌గా నిలిచి కోట్లలో వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు స్పెషల్ సాంగ్ రానుండడంతో అందరిలో ఆసక్తి నెలకొంది. 'పెద్ది'లో స్పెషల్ సాంగ్ హైలైట్‌గా నిలుస్తుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బుచ్చిబాబు తెలిపారు. ఆ పాట ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ బ్లాస్ట్ అని పేర్కొన్నారు. ఇక తాజాగా విడుదలైన 'పెద్ది' ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 63 మిలియన్ల వ్యూస్ వచ్చినట్లు టీమ్ తెలిపింది. అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ అది ట్రెండింగ్‌లో ఉందని పేర్కొంది. రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటిస్తోన్న ఈ సినిమాలో శివరాజ్ కుమార్, జగపతి బాబు కీలకపాత్రల్లో కనిపించనున్నారు.

# కాక్‌టెయిల్-2 విభిన్నమైన మూవీ

### హీరోయిన్ రష్మిక మందన్నా



వైవిధ్యమైన పాత్రలో ప్రేక్షకుల్ని అలరిస్తూ మెప్పిస్తుంటుంది కథానాయిక రష్మిక. ప్రస్తుతం ఆమె 'కాక్‌టెయిల్ 2' సినిమాతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. హిందీ హీరో షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. హోమి అడజానియా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 29న విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజికల్ ఈవెంట్‌ను నిర్వహించింది చిత్రబృందం. రష్మిక మాట్లాడుతూ.. 'కాక్‌టెయిల్ 2' చాలా భిన్నమైన చిత్రం. మీ ఊహకు కూడా అందదు. ముఖ్యంగా ఈ సినిమాలో కృతి అద్భుతంగా నటించింది. మాకు, షాహిద్‌కు మధ్య కెమిస్ట్రీ మరో స్థాయిలో ఉంటుంది. ఈ భిన్నమైన ప్రేమకథను అందరూ ఎంజాయ్ చేస్తారు. ఇప్పటి వరకూ మీరు చూసింది చాలా తక్కువ. ముందు ముందు మంచి సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. వాటిని చూడడం కోసం నేను కూడా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా' అని చెప్పుకొచ్చింది. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలోకి రాబోతుంది.

# కురుప్ప వసూళ్ల సునామీ

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, త్రిష జంటగా ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'కరుప్పు' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తోంది. ఈ చిత్రం కేవలం 4 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.150 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి సంచలనం సృష్టించింది. వారాంతంలోనే కాకుండా వర్కింగ్ డే అయిన సోమవారం కూడా ఈ సినిమా థియేటర్లలో భారీ వసూళ్లను సాధించింది. అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ట్రెండీగా, చాలా స్టాం÷–రగ్‌గా ఉన్నాయి. ఈ జోరు చూస్తుంటే సూర్య సినీ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'కరుప్పు' నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. పాత రికార్డులను తిరగరాస్తూ దూసుకుపోతున్న ఈ చిత్రం త్వరలోనే రూ.200 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

-----



# బాలల చిత్రంగా సమ్మర్ హాలిడేస్




ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్ పై 'సమ్మర్ హాలిడేస్' అనే బాలల చిత్రం రాబోతోంది. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసే అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, 'మన శంకర వరప్రసాద్ గారు' మూవీ ఫేమ్ బేబి ఖుషి కీలక పాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం ఖుషి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. ఖుషి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాలో మెగాస్టార్ చిరంజీవి కూతురి పాత్రలో నటించి అందరిని ఆకట్టుకుంది. ఇందులో ఆ చిన్నారి కీలక పాత్రతో మెప్పించనుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.




# ఒకే బెర్త్.. ఐదు జట్లు పోటీ..

ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసులో మూడు బెర్త్‌లు కన్ఫార్మ్ అయ్యాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటికే ప్లేస్ ఫిక్స్ చేసుకోగా.. చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్‌తోపాటు గుజరాత్ టైటాన్స్ కూడా ప్లే ఆఫ్స్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మూడు జట్లు తమ స్థానాలను ఖరారు చేసుకోగా.. మిగిలిన ఒక స్థానం కోసం ఐదు జట్ల మధ్య పోటీ నెలకొంది. ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ అధికారికంగా ప్లే ఆఫ్స్ నుంచి తప్పుకోగా.. పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు ఒక స్థానం కోసం పోటీ పడుతున్నాయి. ఈ సీజన్‌లో ఫస్టాఫ్‌లో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్.. సెకండాఫ్‌లో పూర్తిగా తేలిపోయింది. వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఓటమితో ప్లే ఆఫ్స్ ఆశలు సంక్లిష్టం చేసుకుంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆఖరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో పంజాబ్ గెలిస్తే.. 15 పాయింట్లకు చేరుకుంటుంది. అదే సమయంలో రాజస్థాన్ రాయల్స్ తమ రెండు మ్యాచ్‌లలో కచ్చితంగా ఒక మ్యాచ్‌లో ఓడిపోవాలి. కేకేఆర్ కూడా ఒక మ్యాచ్‌లో ఓడిపోవాలి. ఒకవేళ కేకేఆర్ రెండు మ్యాచ్‌లు గెలిచినా.. నెట్ రన్ రేట్‌లో పంజాబ్ కంటే వెనుకబడాలి.



లక్నో చేతిలో పంజాబ్ ఓడిపోతే.. 13 పాయింట్ల వద్దే ఆగిపోయి.. కేకేఆర్, రాజస్థాన్, ఢిల్లీ, చెన్నై జట్ల ఓటమి కోసం ప్రార్థించాల్సి ఉంటుంది.రాజస్థాన్ రాయల్స్‌కు ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇవాళ లక్నో సూపర్ జెయింట్స్‌తో.. మరొకటి ఆదివారం ముంబై ఇండియన్స్‌తో ఆడనుంది. రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే.. 16 పాయింట్లతో ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా నేరుగా ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుంది. ఒకవేళ రాజస్థాన్ ఒక్క మ్యాచ్‌లో గెలిచి.. ఒకటి ఓడిపోతే.. అప్పుడు 14 పాయింట్లతో ఉంటారు. పంజాబ్ కింగ్స్, కేకేఆర్ జట్లతోపాటు చెన్నై, ఢిల్లీ జట్ల ఓటమి కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోతే.. టోర్నీ నుంచి ఔట్ అవుతుంది.సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమి కావడంతో ప్లేఆఫ్స్‌కు చేరేందుకు చెన్నై సూపర్ కింగ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. చివరి మ్యాచ్‌లో గెలిస్తే.. 14 పాయింట్లకు చేరుకుంటుంది. అదేసమయంలో పంజాబ్ తమ చివరి మ్యాచ్‌లో ఓడిపోవాలి. రాజస్థాన్ తప్పనిసరిగా రెండు మ్యాచ్‌లలోనూ ఓడిపోవాలి. కేకేఆర్, ఢిల్లీ కూడా గెలవకూడదు. చెన్నై అవకాశాలు రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ జట్ల ఫలితాలపై ఎక్కువగా ఆధారపడి ఉంది.12 మ్యాచ్‌లు ఆడిన కోల్‌కతా నైట్‌రైడర్స్ 11 పాయింట్లతో 8వ స్థానంలో ఉంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే.. 15 పాయింట్లకు చేరుకుంటుంది. అదే సమయంలో పంజాబ్ తమ చివరి మ్యాచ్‌లో ఓడిపోవాలి. రాజస్థాన్ రాయల్స్ కూడా కనీసం ఒక మ్యాచ్‌లో ఓడిపోవాలి. అప్పుడు కేకేఆర్ ప్లే ఆఫ్స్‌లోకి చేరుకుంటుంది. వరుసగా రెండు విజయాలతో టోర్నీని ఆరంభించిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఆ తరువాత పడుతూ లేస్తూ వచ్చింది. గత రెండు మ్యాచ్‌ల్లో విజయంతో ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. ప్రస్తుతం 12 పాయింట్లతో ఉన్న ఢిల్లీ.. మరో మ్యాచ్ కేకేఆర్‌తో ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే 14 పాయింట్లకు చేరుకుంటుంది. అదే సమయంలో రాజస్థాన్ తన రెండు మ్యాచ్‌లలోనూ ఓడిపోవడంతోపాటు పంజాబ్, చెన్నై కూడా జట్లు కూడా గెలవకూడదు. ఇవన్నీ జరిగితేనే ఢిల్లీ ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుంది.

..................

# చాహల్‌కు ఆర్జే మహవాష్ ఊరమాస్ వార్నింగ్!

సోషల్ మీడియాలో ఎప్పుడూ తనదైన శైలి ఫన్నీ కంటెంట్‌తో అలరించే ఆర్జే మహవాష్.. తాజాగా టీమిండియా మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ తో కలిసి చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ రీల్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతోంది. ఆ వీడియోలో ఆర్జే మహవాష్ .. శిఖర్ ధావన్‌ను తన సొంత అన్నయ్యగా పరిచయం చేసింది. అయితే ఈ వీడియో బయటకు వచ్చిన క్షణం నుంచే నెటిజన్లు, క్రికెట్ ఫ్యాన్స్ అందరూ కలిపి స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌ను ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. ఐపీఎల్ 2026 మ్యాచ్‌ల మధ్యలో యుజ్వేంద్ర చాహల్‌కు ఈ వీడియో ద్వారా కొత్త టెన్షన్ మొదలైందంటూ ఫ్యాన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.ఆ వైరల్ వీడియో విషయానికి వస్తే .. "నాతో గొడవ పడితే చూడు.. ఇక్కడ మా అన్నయ్య ఉన్నాడు" అనే క్యాప్షన్‌తో ఆర్జే మహవాష్ ఈ రీల్‌ను పోస్ట్ చేసింది. ఆ వెంటనే బ్యాక్‌గ్రౌండ్‌లో ఓ పవర్‌ఫుల్ మ్యూజిక్‌తో శిఖర్ ధావన్ ఎంట్రీ ఇస్తాడు. ఈ వీడియో చూసిన నెటిజన్లు.. "చాహల్ భయ్యా, జాగ్రత్త! గబ్బర్‌తో నీకు ఆర్జే మహవాష్ దమ్కీ ఇస్తోంది" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. నిజానికి యుజ్వేంద్ర చాహల్, శిఖర్ ధావన్ ఇద్దరూ చాలా మంచి ఫ్రెండ్స్. వీరిద్దరూ గతంలో కలిసి ఎన్నో ఫన్నీ రీల్స్ కూడా చేశారు. ఇప్పుడు చాహల్ ప్రాణ స్నేహితుడినే ఆర్జే మహవాష్ అన్నయ్యను చేయడంతో ఫ్యాన్స్ ఈ విషయాన్ని తెగ ఎంజాయ్ చేస్తున్నారు. ఆర్జే మహవాష్, యుజ్వేంద్ర చాహల్‌ల మధ్య గతంలో వచ్చిన పుకార్ల వల్లే ఈ వీడియో ఇంతలా వైరల్ అవుతోంది. చాహల్ తన మాజీ భార్య ధనశ్రీ వర్మతో విడాకులు తీసుకున్న తర్వాత, ఆర్జే మహవాష్‌తో కలిసి చాలాసార్లు బయట కనిపించాడు. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ అప్పట్లో గట్టిగా ప్రచారం సాగింది. అంతేకాకుండా ఐపీఎల్ 2025 సీజన్ సమయంలో చాహల్ ప్రాతినిధ్యం వహించిన పంజాబ్ కింగ్స్ జట్టుకు ఆర్జే మహవాష్ బహిరంగంగానే సపోర్ట్ చేసింది. అయితే తామిద్దరం కేవలం మంచి స్నేహితులం మాత్రమేనని, తమ మధ్య ఎలాంటి రిలేషన్‌షిప్ లేదని అప్పట్లో ఇద్దరూ స్పష్టం చేశారు. అయితే కొద్దిరోజులకే వీరిద్దరి స్నేహంలో మనస్పర్ధలు వచ్చి కట్



అయినట్లు వార్తలు వచ్చాయి. ఇద్దరూ ఒకరినొకరు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అన్‌ఫాలో చేసుకున్నారు. ఆ తర్వాత ఆర్జే మహవాష్ కూడా చాహల్ పేరు ఎత్తకుండా సోషల్ మీడియాలో కొన్ని సెటైరికల్ పోస్టులు పెట్టింది. వీరిద్దరి దోస్తీ ముగిసిపోయిందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో.. ఇప్పుడు సరిగ్గా చాహల్ బెస్ట్ ఫ్రెండ్ అయిన శిఖర్ ధావన్‌తో ఆర్జే మహవాష్ ఈ వీడియో చేయడం విశేషం. ఏదేమైనప్పటికీ, ఈ వీడియో కేవలం సరదా కోసం చేసినట్లు కనిపిస్తున్నా.. ఐపీఎల్ టెన్షన్ల మధ్య చాహల్‌ను ట్రోల్ చేయడానికి మాత్రం నెటిజన్లకు మంచి వినోదాన్ని ఇస్తోంది.

# వారి భాగస్వామ్యం వల్లే ఓడిపోయే మ్యాచ్‌లో గెలిచాం

## సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్

హెన్రీచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్ మూడో వికెట్‌కు నెలకొల్పిన 75 పరుగుల భాగస్వామ్యంతోనే విజయం సాధించామని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ అన్నాడు. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ కూడా కొంత వరకు కెప్టెన్సీ చేశాడని, ఈ గెలుపు క్రెడిట్ అతనికే దక్కుతుందని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో చెపాక్ మైదానం వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించి ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఈ విజయానంతరం మాట్లాడిన పాట్ కమిన్స్.. ఇషాన్ కిషన్, హెన్రీచ్ క్లాసెన్‌లపై ప్రశంసల జల్లు కురిపించాడు.



బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై అసాధారణ ప్రదర్శన కనబర్చారని కొనియాడాడు. ' ఈ విజయం చాలా సంతృప్తిని ఇచ్చింది. మేం సాధారణంగా ఆడే విధానానికి ఈ మ్యాచ్ కొంచెం భిన్నంగా సాగింది. ఈ పిచ్ బ్యాటింగ్‌కు కష్టంగా ఉంది. క్లాసెన్, ఇషాన్ కిషన్ అసాధారణమైన బ్యాటింగ్‌తో గెలిపించారు. వారి ప్రదర్శన చాలా సంతోషాన్నిచ్చింది. ఇషాన్, క్లాసెన్ అద్భుతమైన భాగస్వామ్యమే మా విజయానికి బాటలు వేసింది.ఎందుకంటే పిచ్ బ్యాటింగ్‌కు కష్టంగా ఉంది. మాకు 1-2 భాగస్వామ్యాలు అవసరమని మేం భావించాం.

ఈ పిచ్‌పై కాస్త సెట్ అయిన తర్వాత బ్యాటింగ్ చేయడం కొంచెం సులువవుతుంది. మొదట్లో బ్యాటింగ్ చేయడం చాలా కష్టం. కానీ ఇషాన్-క్లాసెన్ సరైన బౌలర్లను టార్గెట్ చేసుకుని కొన్ని అద్భుతమైన షాట్లు ఆడారు. ఈ రన్ ఛేజ్‌లో బాధ్యతాయుతమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చారు.గత మ్యాచ్‌లో 86 పరుగులకే ఆలౌట్ అయిన తర్వాత మా బ్యాటింగ్ గురించి చర్చించాం. మేం బాధ్యతాయుతమైన బ్యాటింగ్‌కు అంతగా పేరుగాంచలేదు. కానీ అవసరమైనప్పుడు ఆడగలమని నిరూపించాం. అయితే మా బౌలింగ్ సమయంలోనే పిచ్ కాస్త స్లోగా ఉందని, తక్కువ ఎత్తులో బంతి వస్తున్నట్లు గమనించాం. పిచ్‌పై బంతి ఆగుతూ వచ్చినట్లు కూడా అనిపించింది. దాంతో క్రీజులోకి వెళ్లి గుడ్డిగా బ్యాటింగ్ చేయవద్దని మేం నిర్ణయించుకున్నాం. మా బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. ఈ పిచ్‌పై 180 పరుగులు మంచి స్కోరే. కానీ 1-2 భాగస్వామ్యాలపైనే విజయవకాశాలు అధారపడి ఉంటాయి. టాస్ గురించి మేం పట్టించుకోలేదు. ఇక్కడ ఛేజింగ్ చేసిన టీమ్స్ కూడా గెలిచాయని గుర్తించాం. ప్లే ఆఫ్స్ చేరినా టాప్-2లో నిలిచేందుకు ప్రయత్నిస్తాం. ఆఖరి మ్యాచ్‌లో విజయం కోసం మా సాయశక్తులా పోరాడుతాం. అసలైన ఆట ఇప్పుడు మొదలవుతుంది. కాబట్టి జట్టుగా మరింత కష్టపడాల్సి ఉంటుంది. ఇషాన్ కిషన్ కూడా ఈ మ్యాచ్‌లో సగం వరకు కెప్టెన్సీ చేశాడు. కాబట్టి ఈ విజయంలో అతనికి మరింత క్రెడిట్ దక్కాలి. మా జట్టు ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉంది.గెలిచినా.. మెరుగుపర్చుకునే విషయాలు ఎప్పుడూ కొన్ని ఉంటాయి. మేం లైన్ అండ్ లెంగ్త్ కొద్దిగా తప్పిన ఒకట్రెండు ఓవర్లు ఉన్నాయి. పిచ్ పరిస్థితులను మేం ఇంకాస్త వేగంగా అంచనా వేసి ఉండాల్సింది. కానీ మొత్తంగా చూసుకుంటే.. ఈ ప్రదర్శన పట్ల చాలా సంతోషంగా ఉన్నాను.'అని పాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు.

.........

# పంత్ కెరీర్ ముగిసినట్లేనా..?



ఐపీఎల్ 2026 ముగియక ముందే భారత క్రికెట్‌లో మరో భారీ ట్విస్ట్ చోటుచేసుకుంది. ఆఫ్ఘనిస్తాన్‌తో జూన్ 6 నుంచి ప్రారంభమయ్యే ఏకైక టెస్టు కోసం బీసీసీఐ ప్రకటించిన జట్టులో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది రిషబ్ పంత్ డిమోషన్. టీమ్ఇండియా భవిష్యత్ నాయకుల్లో ఒకడిగా భావించిన పంత్‌ను టెస్టు వైస్ కెప్టెన్సీ నుంచి తప్పిస్తూ.. అనుభవజ్ఞుడు కేఎల్ రాహుల్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. ఈ నిర్ణయం ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. రోహిత్ శర్మ టెస్టులకు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టులో నాయకత్వ మార్పులు వేగంగా జరిగాయి. యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌ను టెస్టు కెప్టెన్‌గా ఎంపిక చేసిన సెలెక్టర్లు.. అప్పట్లో రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. కానీ ఇప్పుడు కేవలం కొద్ది కాలంలోనే పంత్ నుంచి ఆ బాధ్యతలను తీసేసి, కేఎల్ రాహుల్‌కు అప్పగించడం గమనార్హం. జూన్ 6 నుంచి ముల్లన్‌పూర్ వేదికగా ప్రారంభమయ్యే ఈ టెస్టులో శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా జట్టును నడిపించనున్నాడు. అతనికి డిప్యూటీగా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు. ఈ మార్పుతో టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ భవిష్యత్ నాయకత్వంపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్సీ నుంచి తొలగించడం ఒక్కసారిగా తీసుకున్న నిర్ణయం కాదని తెలుస్తోంది. దీనికి పలు కారణాలు ఉన్నాయని బీసీసీఐ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా కెప్టెన్సీ ఒత్తిడి అతని సహజమైన దూకుడు బ్యాటింగ్‌ను ప్రభావితం చేస్తోందనే అభిప్రాయం సెలెక్టర్లలో బలపడిందని సమాచారం. ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా పంత్ ప్రదర్శన తీవ్ర విమర్శలకు గురైంది. బ్యాటింగ్‌లోనూ అతను ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. కీలక మ్యాచ్‌ల్లో తీసుకున్న నిర్ణయాలు కూడా ప్రశ్నార్థకంగా మారాయి. దీంతో నాయకత్వ బాధ్యతల కంటే అతను పూర్తిగా బ్యాటింగ్‌పైనే దృష్టి పెట్టాలని బోర్డు భావించినట్లు తెలుస్తోంది. అంతేకాదు.. గతంలో దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ మైదానం వెలుపల ఉన్న సమయంలో పంత్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే ఆ సమయంలో అతని ఫీల్డ్ సెట్టింగ్స్, బౌలింగ్ మార్పులు టీమ్ మేనేజ్‌మెంట్‌ను పెద్దగా ఆకట్టుకోలేదని సమాచారం. రిషబ్ పంత్ అంటే భారత అభిమానులకు వెంటనే గుర్తొచ్చేది గబ్బా హీరోయిక్స్. ఒంటరిగా మ్యాచ్‌ను తిప్పేసే దూకుడు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడినప్పుడు పంత్ అత్యంత ప్రమాదకరమైన మ్యాచ్ విన్నర్‌గా మారతాడని బీసీసీఐ నమ్ముతోంది. అందుకే ఇప్పుడు అతనిపై ఉన్న నాయకత్వ భారం తగ్గించి, పూర్తిగా వికెట్ కీపర్-బ్యాటర్ పాత్రకే పరిమితం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ దిగ్గజాలు క్రమంగా టెస్టు జట్టుకు దూరమవుతున్న నేపథ్యంలో ఇప్పుడు అనుభవజ్ఞుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో కేఎల్ రాహుల్ జట్టులో అత్యంత అనుభవం ఉన్న ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. రాహుల్ ఇప్పటికే భారత జట్టుకు మూడు టెస్టుల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2022లో జోహన్నెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాపై భారత్‌ను నడిపించడంతో పాటు.. బంగ్లాదేశ్ పర్యటనలో కూడా నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. ప్రశాంత స్వభావం, క్లిష్ట పరిస్థితుల్లో స్థిరంగా ఆలోచించే తీరు అతనికి ప్లస్ పాయింట్‌గా మారాయి. అందుకే యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు సరైన సపోర్ట్‌గా రాహుల్‌ను సెలెక్టర్లు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. రిషబ్ పంత్‌కు ఎదురైన ఎదురుదెబ్బ కేవలం టెస్టులకే పరిమితం కాలేదు. అతను ఇప్పటికే టీ20 సెటప్‌కు దూరమయ్యాడు. ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు కూడా అతనికి చోటు దక్కలేదు. దీంతో మూడు ఫార్మాట్లలోనూ తన స్థానాన్ని నిలబెట్టుకోవడానికి పంత్ ఇప్పుడు భారీగా పరుగులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశీయ క్రికెట్, రాబోయే సిరీస్‌లలో తన బ్యాట్‌తోనే సమాధానం చెప్పాల్సిన ఒత్తిడి ఇప్పుడు పంత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది.

# ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

## జట్టులోకి హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్

ఐపీఎల్ 2026 ఫీవర్ ముగిసేలోపే టీమ్ఇండియా మళ్లీ ఇంటర్నేషనల్ క్రికెట్ మోడ్‌లోకి ఎంటర్ కానుంది. మే 31న ఐపీఎల్ ఫైనల్‌తో మెగా టోర్నీ ముగియనుండగా.. వెంటనే జూన్‌లో అఫ్గానిస్థాన్‌తో కీలక సిరీస్‌కు భారత్ సిద్ధమవుతోంది. స్వదేశంలో జరగనున్న ఈ సిరీస్‌లో ఒక టెస్టు, మూడు వన్డేలు ఉండనున్నాయి. ఈ టూర్ కోసం భారత సీనియర్ సెలక్షన్ కమిటీ తాజాగా జట్లను ప్రకటించింది. ఈసారి జట్టులో యువ ఆటగాళ్లకు పెద్దపీట వేయడం విశేషం. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా విశ్రాంతి ఇచ్చారు. మరోవైపు వన్డే జట్టులో రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యలకు చోటు దక్కినా.. వారి ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు స్పష్టం చేశారు. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ మాట్లాడుతూ.. మహ్మద్ షమి విషయంపై సెలక్షన్ కమిటీ చర్చించలేదని తెలిపారు. ఈ సిరీస్‌లో యువ క్రికెటర్లకు భారీ అవకాశం దక్కింది. హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్ తొలిసారిగా భారత జట్టులో స్థానం సంపాదించారు. ముఖ్యంగా ప్రిన్స్ యాదవ్ వన్డే జట్టులోనే చోటు దక్కించుకోవడం ఆసక్తికరంగా మారింది. టెస్టు జట్టుకు యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు. యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్ వంటి యువ ఆటగాళ్లతో జట్టు బలంగా కనిపిస్తోంది. బౌలింగ్ విభాగంలో మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్ కీలక బాధ్యతలు తీసుకోనున్నారు. వన్డే జట్టులో మాత్రం అనుభవం-యువత కలయిక కనిపిస్తోంది. కెప్టెన్‌గా మళ్లీ శుభ్‌మన్ గిల్‌కే బాధ్యతలు అప్పగించగా.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ వంటి సీనియర్ బ్యాటర్లు జట్టుకు బలం కానున్నారు. ఇషాన్ కిషన్ తిరిగి వన్డే సెటప్‌లో చోటు సంపాదించగా.. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి పేసర్లు అఫ్గాన్ బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు.

**అఫ్గాన్‌తో ఏకైక టెస్టుకు భారత జట్టు..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, మానవ్ సుతార్, ప్రసిద్ధ్ కృష్ణ,

# సంజు శాంసన్ సరికొత్త రికార్డు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో మహేంద్ర సింగ్ ధోని సుదీర్ఘకాలంగా ఏలుతున్న ఒక అరుదైన రికార్డుల లిస్టులో సంజు శాంసన్ తన పేరును లిఖించుకున్నాడు. సోమవారం చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ ఈ అద్భుతమైన ఘనత సాధించాడు. ఒకే ఐపీఎల్ సీజన్ లో సీఎస్కే తరపున ఒక వికెట్ కీపర్ గా అత్యధిక పరుగులు చేసిన ఎంఎస్ ధోని రికార్డును ఆయన బద్దలు కొట్టాడు. ఇంతకుముందు ధోని 2013 ఐపీఎల్ సీజన్ లో 16 ఇన్నింగ్స్ ఆడి 461 పరుగులు సాధించాడు. ఈ మార్కును దాటడానికి శాంసన్‌కు మ్యాచ్ ప్రారంభంలో కేవలం 12 పరుగులు మాత్రమే అవసరం అవ్వగా, ఆయన కేవలం ఆరు బంతుల్లోనే 15 పరుగులు చేసి ఆ మైలురాయిని దాటేశాడు. హైదరాబాద్ బౌలర్ నితీష్ కుమార్ రెడ్డి వేసిన మొదటి ఓవర్ లోనే శాంసన్ ఈ స్కోరు అందుకోవడం విశేషం. రికార్డు దాటిన తర్వాత కూడా సంజు శాంసన్ తన అగ్రెసివ్ బ్యాటింగ్ శైలిని అస్సలు ఆపలేదు. రెండో ఓవర్ లో బౌలింగ్‌కు వచ్చిన ప్రఫుల్ హింగే ఓవర్ లో వరుసగా మూడు బౌండరీలు బాది స్టేడియాన్ని హోరెత్తించాడు. కేవలం 11 బంతుల్లోనే 27 పరుగులు చేసి మంచి టచ్ లో కనిపించిన శాంసన్‌ను అడ్డుకోవడానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ స్వయంగా బౌలింగ్ రంగానికి వచ్చాడు. కమిన్స్ వేసిన ఒక పవర్‌ఫుల్ యార్కర్‌ను శాంసన్ సమర్థవంతంగా డిఫెండ్ చేశాడు. ఆ తర్వాతి బంతిని కమిన్స్ ఆఫ్ స్టంప్‌కు వెలుపల వేయగా, శాంసన్ డ్రైవ్ చేయడానికి ప్రయత్నించాడు. ఆ షాట్ మిస్ అవ్వడంతో బంతి బ్యాట్ ఎడ్జ్ కు తగిలి వికెట్ కీపర్ చేతుల్లోకి వెళ్ళింది. దాంతో శాంసన్ ఇన్నింగ్స్ ముగిసింది. ఓవరాల్ గా చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో వికెట్ కీపర్ బ్యాటర్ గా ధోని రికార్డులు అన్-మ్యాచ్‌డ్ గా ఉన్నప్పటికీ, ఈ లిస్టులో ప్రముఖంగా నిలిచిన రెండో ప్లేయర్ గా సంజు శాంసన్ గుర్తింపు తెచ్చుకున్నాడు. ఐపీఎల్ లో ఒకే సీజన్ లో సీఎస్కే తరపున 100 కంటే ఎక్కువ పరుగులు చేసిన వికెట్ కీపర్లు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారిలో మొదటి వ్యక్తి ఎంఎస్ ధోని కాగా, రెండో ఆటగాడు 2008 సీజన్ లో రాణించిన పార్థివ్ పటేల్. ఇప్పుడు ఈ 2026 సీజన్ లో సంజు శాంసన్ ఆ లిస్టులోకి చేరాడు. ప్రస్తుత ఐపీఎల్ 2026 టోర్నమెంట్ లో శాంసన్ అద్భుతమైన ఫామ్ లో ఉన్నాడు. ఆయన ఇప్పటివరకు 13 ఇన్నింగ్స్ ఆడి 47.7 సగటుతో మొత్తంగా 477 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ రేసులో దూసుకుపోతున్నాడు. అంతకుముందు ఎమ్ ఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఈ సీజన్ లో అంతకుముందు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో హైదరాబాద్ జట్టు చెన్నైని 10 పరుగుల తేడాతో ఓడించింది. టాస్ సమయంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఒక ముఖ్యమైన విషయాన్ని షేర్ చేశాడు. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా లెజెండరీ ప్లేయర్ ఎంఎస్ ధోని ఈ మ్యాచ్ ఆడటం లేదని స్పష్టం చేశాడు.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999